


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక :99 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 14 డిసెంబర్ 2024 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE :99 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 14 DECEMBER 2024 PRICE : 5/- RS
Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## నాకు అలాంటి మిత్రుడు ఉండడం సంతోషం కలిగించే విషయం

- స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ విడుదల
- విజయవాడలో కార్యక్రమం
- హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేశ్
- పవన్ మాటను జీవితంలో మర్చిపోలేనన్న చంద్రబాబు



**పెన్ పవర్ డెస్క్:**విజయవాడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. ఇవాళ అందరినీ చూస్తుంటే, ఒక కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టడానికి ఇక్కడ సమావేశమయ్యాం అనిపిస్తోందని అన్నారు. రాష్ట్ర దశ దిశను మార్చే స్వర్ణాంధ్ర విజన్-2047ను ఇవాళ ఆవిష్కరించామని వెల్లడించారు. "ప్రపంచంలోనే తెలుగుజాతిని నెంబర్ వన్ గా చేసేందుకు ఇవాళ బీజం పడింది.. ఇది సాధ్యమే అని మరొక్కసారి చెబుతున్నా. ప్రజల తలరాతలను, భావితరాల భవిష్యత్ ను మార్చేదే ఈ స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్. నేను చాలా ఎన్నికలు చూశాను కానీ... 2024 ఎన్నికలకు ఒక ప్రత్యేకత ఉంది. 1978 నుంచి నేను ప్రత్యక్షంగా ఎన్నికల్లో భాగస్వామినయ్యాను. అనేక ఎన్నికల్లో పోటీ చేశాను. కానీ 2024లో 93 శాతం సక్సెస్ రేటుతో, 57 శాతం ఓట్లు పడిన ఏకైక ఎన్నికలు నా జీవితంలో మొదటిసారి చూశాను. ప్రజల్లో ఆనాడు ఉన్న వాస్తవ పరిస్థితులను పవన్ కల్యాణ్ గారు అప్పుడే గమనించి ఒక మాటన్నారు. ఆ మాట నేనెప్పుడూ కూడా మర్చిపోలేను. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యతిరేక ఓట్లు చీలడానికి వీల్లేదు... కలిసి ఉంటే బలం ఉంటుంది... కలిసి పనిచేద్దాం అని స్పష్టమైన వైఖరి ప్రదర్శించి, ఆ మేరకు కలిసి నడిచిన వ్యక్తి పవన్ కల్యాణ్. 2014లోనూ, 2024లోనూ చూశాను... నాకేం వస్తుంది అని కాకుండా... రాష్ట్రానికి ఏం మేలు జరుగుతుంది అని ఆలోచించి పవన్ కల్యాణ్ పూర్తిగా సహకరించారు. అలాంటి ఒక మంచి మిత్రుడు ఉండడం చాలా సంతోషదాయకం.
రాజకీయాల్లో నాకు ఎంతో అనుభవం ఉంది... నాలుగోసారి ముఖ్యమంత్రిని... కానీ గత ప్రభుత్వ హయాంలో ఎందుకంత విధ్వంసం జరిగిందో నాకు అర్థం కాలేదు. అన్ని ఇబ్బందులు

వివరాలు 2లో..

## ఒక్కరోజే టాలీవుడ్ షేక్..

### వర్టికల్‌గా డివైడ్ అయిన పొలిటికల్ పార్టీస్



- చంచల్ గూడ జైలుకు అల్లు అర్జున్
- సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో ఏ11గా బన్నీ
- 14 రోజుల పాటు రిమాండ్ విధించిన కోర్టు
- మోహన్ బాబుకు హైకోర్టులో చుక్కెదురు
- ముందస్తు బెయిల్ కొట్టేసిన న్యాయస్థానం
- వర్టికల్ గా డివైడ్ అయిన రాజకీయ పార్టీలు
- అల్లు అర్జున్ కు బీజేపీ, బీఆర్ఎస్, వైసీపీ సపోర్ట్
- చట్టం తన పని తాను చేసుకు పోతుందన్న కాంగ్రెస్
- పోలీసుల వైఫల్యమేనంటున్న హరీశ్ రావు

వివరాలు 2లో..

## రాజ్యాంగం ఓ ఒప్పందం.. సంఘ్ విధానం కాదు

### లోక్ సభలో తొలి ప్రసంగంలో ప్రియాంకగాంధీ



**పెన్ పవర్ డెస్క్:**ప్రియాంకగాంధీ.. వయనాడ్ నుంచి తొలిసారి ఎంపీగా గెలిచి లోక్ సభలో అడుగు పెట్టారు.. తొలిప్రసంగంలోనే కేంద్ర ప్రభుత్వం విరుచుపడ్డారు..ప్రియాంక తొలి ప్రసంగం మొత్తం రాజ్యాంగం, రిజర్వేషన్లు, దేశ వ్యాప్తం గా కుల గణను చుట్టే తిరిగింది. భారత రాజ్యాంగం అంటే ఏందో ప్రధాని మోదీకి అర్థం కాదు..రాజ్యాంగం ఓ ఒప్పందం..సంఘ్ విధానం కాదు అని అన్నారు

వివరాలు 2లో..

## నా తొలి ప్రసంగం కంటే బెటర్

### లోక్‌సభలో ప్రియాంక తొలిస్పీచ్‌పై రాహుల్

వివరాలు 2లో..




## ఎడిటర్ వ్యూ

# పొంచి ఉన్న పొరుగు ముప్పు

బంగ్లాదేశ్ నిజ స్వరూపం ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. తూర్పు పాకిస్తాన్ పేరును సార్థకం చేసుకోవాలని అనుకుంటుంది. యూనస్‌ని రబ్బర్ స్టాంప్ చేసి పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఆర్మీ, గేమ్ ఆడుతున్నట్లు కనిపిస్తుంది. పాకిస్తానీయులు బంగ్లాదేశ్ వెళ్లడానికి సెక్యూరిటీ క్లియరెన్స్ ఎత్తేశారు. బంగ్లా పాకిస్తాన్‌కు దగ్గరౌతుందనడానికి ఇది పెద్ద నిదర్శనంగా కనిపిస్తోంది. ఇండియా సహకారంతో స్వతంత్ర దేశంగా అవతరించిన బంగ్లాదేశ్, భారత్‌కే ముప్పుగా మారుతుందనే సందేహం వస్తోంది. బంగ్లాదేశ్‌లో మధ్యంతర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తుంటే.. భారత వ్యతిరేక పాకిస్తాన్‌కు మరింత దగ్గరవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయ్. విద్యార్థి ఉద్యమంతో మొదలైన బంగ్లాదేశ్ ఉద్రిక్తత.. తర్వాత, భారత వ్యతిరేక ఉద్యమంగా మార్పు చెందడం చాలా అనుమానాలను రేపింది.బంగ్లాదేశ్ మిలటరీ కనుసన్నల్లో ఏర్పాటైన యూనస్ మధ్యంతర ప్రభుత్వం దీనికి మరింత ఆజ్యం పోసింది. నోబుల్ శాంతి బహుమతి పొందిన ముహమ్మద్ యూనస్.. తన దేశాన్ని తీవ్రమైన అశాంతి దిశగా నడిపే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా, యూనస్‌కి అధికారం వచ్చిన తర్వాత ఉగ్రవాదుల్ని పెంచి పోషించే పాకిస్తాన్‌కు బంగ్లాదేశ్ మరింత దగ్గరయ్యింది. పాకిస్తాన్ నాయకులతో పెరిగిన సంప్రదింపుల నుండీ పాక్‌తో చేసుకుంటున్న మిలటరీ ఒప్పందాల వరకూ చాలా అంశాల్లో పాక్-బంగ్లాదేశ్‌ల మధ్య బంధం బలపడుతూ ఉంది. బంగ్లాదేశ్ పాకిస్తాన్ నుండి భారీ సంఖ్యలో ఆయుధాలను కొనుగోలు చేసింది. దీని తర్వాత, కొన్ని రోజుల క్రితమే, బంగ్లాదేశ్- భారత్ సరిహద్దుల్లో అత్యంత బలమైన వార్ డ్రోన్లను మొహరించింది. నిఘా కోసం మాత్రమే పెట్టామంటూ బొంకింది కూడా. ఇక, తాజాగా, మిలటరీ ఆదేశాలతో నడుస్తున్న యూనస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో పాకిస్తానీయులు బంగ్లాదేశ్ రావాలంటే సెక్యూరిటీ క్లియరెన్స్ తప్పనిసరిగా ఉండేది. అలాంటిది, ఇప్పుడు ఆ క్లియరెన్స్ ఏమీ లేకుండానే వీసాలకు అనుమతి ఇచ్చేశారు పాక్ ఉగ్రవాదులు కూడా స్వేచ్ఛగా బంగ్లాదేశ్‌లోకి అడుగుపెట్టడానికి ఎంట్రీ మరింత సులువుగా మార్చారు. బంగ్లాదేశ్ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని సెక్యూరిటీ సర్వీసెస్ విభాగం.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఈ మేరకు సమాచారం ఇచ్చినట్లు ఆ దేశ స్థానిక మీడియా చెప్పింది. అయితే, ప్రభుత్వం నిర్ణయంపై అక్కడ నుండి ఎలాంటి కామెంట్లూ రాలేదు. గతంలో, తమ దేశంలోకి ఉగ్రవాదుల్ని రాకుండా అరికట్టడానికి చేసిన చట్టాన్ని ఇప్పుడు ఎందుకు ఎత్తేశారనే దానిపై ఎలాంటి విశ్లేషణా లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.2019 నుండి.. పాకిస్తాన్ పౌరులు బంగ్లాదేశ్ వీసా పొందాలంటే బంగ్లా సెక్యూరిటీ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ నుండి "నో అబ్జెక్షన్" సర్టిఫికేట్ పొందాలి. ఆ సమయంలో పాకిస్తాన్-బంగ్లాదేశ్ మధ్య కొనసాగుతున్న రాజకీయ, దౌత్యపరమైన ఉద్రిక్తతల మధ్య భద్రతా ప్రోటోకాల్స్‌లో భాగంగా ఈ విధానం ప్రవేశపెట్టారు. అయితే, మహ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వంలో పాకిస్తాన్-బంగ్లాదేశ్ సంబంధాలను మెరుగుపరచడంలో భాగంగా ఈ విధానాన్ని రద్దు చేశారు. ఇకపై, సెక్యూరిటీ క్లియరెన్స్ అవసరం లేదంటూ నిర్ణయం తీసుకున్నారు. నవంబర్‌లో కరాచీ నుండి చిట్టగాంగ్‌కు నేరుగా కార్గో నౌకల తరలింపును బంగ్లాదేశ్ ప్రభుత్వం అనుమతించిన ఒక నెల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది.డిసెంబర్ 3న, బంగ్లాదేశ్‌లోని పాకిస్తాన్ హైకమిషనర్ సయ్యద్ అహ్మద్ మరూఫ్, బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధినేత బేగం ఖలీదా జియాను తన ఇంటిలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం ఈ ప్రకటన రావడం చర్చకు దారి తీసింది. దేశ భద్రతకు అవసరమైన ఈ చర్యను మాఫీ చేయడంపై చాలా మంది విమర్శలు కూడా చేస్తున్నారు. ఖలీదా జియా బంగ్లాదేశ్ ప్రభుత్వంలో ఎలాంటి అధికారిక హోదాలో లేకపోయినప్పటికీ.. ఆమే సలహా మేరకే ఇది జరిగినట్లు కొందరు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో.. బంగ్లా ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్-ఉజ్-జమాన్ కనుసన్నల్లో గవర్నమెంట్ చీఫ్ సలహాదారుగా ఉన్న యూనస్ రబ్బర్ స్టాంప్‌లా వ్యవహరిస్తున్నారనే కామెంట్లు వస్తున్నాయి.ప్రస్తుతం, బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఉగ్రవాదులు, ఛాందసవాదులను అనుమతించే "ఫాసిస్ట్ పాలన" నడుస్తుందని ఆరోపించారు. డిసెంబర్ 8న లండన్‌లో విదేశీ అవామీ లీగ్ మద్దతుదారుల సమావేశానికి వర్చువల్‌గా చేసిన ప్రసంగంలో హసీనా ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రభుత్వాన్ని కూలదోసిన జూలై-ఆగస్టు అల్లర్ల వెనక యూనస్ "మాస్టర్ మైండ్" ఉందని కూడా ఆమె ఆరోపించారు.ఆగస్టు 5 నుండి, మైనార్టీలు, హిందువులు, క్రైస్తవులు, బౌద్ధుల ప్రార్థనా స్థలాలపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయనీ.. యూనస్ పాలనలో జమాత్, ఉగ్రవాదులు స్వేచ్ఛగా తిరుగుతున్నారంటూ విమర్శించారు. కాల్పులు, హత్యలకు పాల్పిడిన ఉగ్రవాదులు, నేరస్థులకు యూనస్ ప్రభుత్వం క్షమాభిక్ష కల్పిస్తోందని హసీనా ఆరోపించారు. హసీనా విడుదల చేసిన 37 నిమిషాల ఆడియో రికార్డింగ్‌ను బంగ్లాదేశ్ స్టూడెంట్స్ లీగ్, బంగ్లాదేశ్ అవామీ లీగ్ ఫేస్‌బుక్ పేజీలో షేర్ చేశారు.అయితే, ఈ కీలక పరిణామల మధ్య తాజాగా భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ డిసెంబర్ 9న ఢాకా పర్యటించారు. అక్కడ, యూనస్‌తో సమావేశమైన మిస్రీ? బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీల భద్రతపై ఆందోళనను తెలియజేశారు. "సాంస్కృతిక, మత, దౌత్యపరమైన ఆస్తులపై దాడులు చేయడం విచారకరమని" మిస్రీ, యూనస్‌కు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే, ఇటీవల, దేశ ద్రోహం కేసులో బంగ్లా పోలీసులు అరెస్ట్ చేసిన ఇస్కాన్ గురువు చిన్మోయ్ కృష్ణ దాస్ కేసును వాదించే న్యాయవాదిని కూడా కేసును వాదించకుండా నిరోధించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.దేశం చట్టపరమైన హక్కులను ఉల్లంఘిస్తుందని ఆరోపిస్తున్నారు. ఇక, బంగ్లాదేశ్‌లో ప్రస్తుతమున్న పరిస్థితిపై యూరోపియన్ యూనియన్ కూడా స్పందించింది. యూనస్ నేతృత్వంలో నడుస్తున్న ప్రభుత్వం చట్టపరమైన పాలనకు ప్రాధాన్యతనివ్వాలని, విధి విధానాలను గౌరవించాలని, దేశ పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడాలని కోరింది. బంగ్లాదేశ్‌లో మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలపై తీవ్రంగా స్పందించింది. ఏది ఏమైనప్పటికీ? భారతదేశానికి వ్యతిరేకిగా.. చైనాకు అనుకూలంగా ఉన్న బంగ్లా ఆర్మీ చీఫ్, జనరల్ వాకర్-ఉజ్-జమాన్ ఆదేశాలమేరకే మహ్మద్ యూనస్ ప్రభుత్వం నడుస్తుందనే వాదన గట్టిగా ఉంది. అందుకే, భారత్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్‌కు దగ్గరౌతుందని నిపుణులు కూడా భావిస్తున్నారు.

## అల్లు అర్జున్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నా..

- మొదటి పేజీ తరువాయి

బాధకార విషయం అయినప్పటికీ, ఆ కుటుంబానికి అండగా ఉంటానంటూ అల్లు అర్జున్ బాధ్యతగా నడుచుకున్న విషయాన్ని జగన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోవడం వల్ల ఆ కుటుంబానికి జరిగిన నష్టం తీర్చలేనిది. ఈ ఘటనపై అల్లు అర్జున్ విచారం వ్యక్తం చేసి, ఆ కుటుంబానికి అండగా ఉంటానంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించారు. అటువంటి అతన్ని ఈ ఘటనకు నేరుగా బాధ్యుడ్ని చేయడం ఎంతవరకు సమంజసం? తొక్కిసలాట ఘటనలో తన ప్రమేయం లేకపోయినా అర్జున్‌పై క్రిమినల్ కేసులు బనాయించి, అరెస్టు చేయడం సమ్మతం కాదు. అల్లు అర్జున్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాను.." అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.మరోవైపు, ఈ కేసులో నాంపల్లి కోర్టు.. అల్లు అర్జున్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. దాంతో, పోలీసులు అతన్ని చంచల్ గూడ జైలుకు తరలిస్తున్నారు.

## ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి హౌస్ అరెస్ట్!

- మొదటి పేజీ తరువాయి

అక్కడ ఆయనను కొందరు వ్యక్తులు అడ్డుకుని సంబంధిత పత్రాలను చించివేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఎంపీ అవినాశ్ రెడ్డి వేముల పీఎస్‌కి వెళ్లి ఎస్ఐతో మాట్లాడారు. ఆ సమయంలో అక్కడికి భారీగా వైసీపీ కార్యకర్తలు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో గొడవ జరిగే అవకాశం ఉందని పోలీసులు ఎంపీ అవినాశ్ రెడ్డిని అదుపులోకి తీసుకుని తమ వాహనంలోనే పులివెందులలోని జగన్ క్యాంపు ఆఫీస్‌కి తరలించారు. అక్కడే సీఐ నరసింహులు ఆధ్వర్యంలో హౌస్ అరెస్ట్ చేశారు.

# నాకు అలాంటి మిత్రుడు ఉండడం సంతోషం కలిగించే విషయం

- మొదటి పేజీ తరువాయి

ఎదుర్కొని, ఒక్కొక్క అడుగు వేస్తూ రాష్ట్ర పునర్ నిర్మాణం చేస్తున్నాం. కూటమి పాలనకు ఆర్నెల్లు పూర్తయిన వెంటనే... విజన్-2047 డాక్యుమెంట్ ను తీసుకువచ్చి తెలుగుజాతిని భారతదేశానికి అంకితం చేశామంటే అది మా అకుంఠిత దీక్షకు నిదర్శనం.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే ఒక శక్తిమంతమైన దేశంగా తయారవుతోంది. 2047లో మనం 100 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటుంది. అప్పటికల్లా మన దేశం ప్రపంచంలో ఒక అగ్రదేశంగా ఉండాలన్న ఉద్దేశంతో వికసిత భారత్-2047 కార్యాచరణను ప్రధాని మోదీ రూపొందించారు. ఆ మేరకు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు పోతున్నారు. అందులో భాగంగానే మనం ఈ రోజు స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువచ్చాం.

మోదీ, మనందరి ఆలోచన భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ గా ఉండాలి. ఈ క్రమంలో... ఏపీతో పాటు తెలుగుజాతి కూడా ప్రపంచంలో నెంబర్ వన్ గా ఉండాలనేది మా సంకల్పం. నేను గానీ, పవన్ కల్యాణ్ గానీ కోరుకునేది అదే.

మన తలసరి ఆదాయం 3 వేల డాలర్ల కంటే తక్కువ. 2047 నాటికి 42 వేల డాలర్లు తలసరి ఆదాయం లభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

పవన్ కల్యాణ్ చెప్పినట్టు... ఇంతకుముందు హైదరాబాద్, సికింద్రాబాద్ రెండే నగరాలు ఉండేవి. హైదరాబాద్ నగరం పశ్చిమ ప్రాంతానికి వెళితే ఎక్కడ చూసినా రాళ్లు, గుట్టలే ఉండేవి. ఆ గుట్టల్లో నేను భవిష్యత్ నగరాన్ని చూశాను. ఆ మేరకు 25 సంవత్సరాల్లో ప్రపంచస్థాయిన నగరం అవుతుందని భావించి, ఆ దిశగా రూపకల్పన చేశామంటే అదీ ఆనాటి విజన్ ప్రభావం.

పవన్ కల్యాణ్ ఎప్పుడూ అంటుంటారు... సార్, మేమందరం అక్కడ రాళ్లు చూశాం... మీరు మాత్రం ఒక విజన్ చూశారు అని. అవును... ఆ రోజు అందులోనే నేను ఒక సింగపూర్ చూశాను, ఒక దుబాయ్ ని చూశాను, న్యూయార్క్ సిటీని చూశాను. అలాంటి నగరాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేం అని భావించి, అంచెలంచెలుగా అభివృద్ధి చేశాం. ఇవాళ హైదరాబాద్ వల్ల తెలంగాణ రాష్ట్రం భారతదేశంలోనే ఎక్కువ తలసరి ఆదాయం లభించే రాష్ట్రంగా ఉందని గర్వంగా చెప్పగలుగుతున్నాం. మేం ఆనాడు వేసిన పునాదే అందుకు కారణం" అని చంద్రబాబు వివరించారు.

## ఒక యోగిలా ఉన్నారు... ఆయనను చూస్తుంటే చేతులెత్తి నమస్కరించాలనిపిస్తోంది

- మొదటి పేజీ తరువాయి

ఈ రోజు ఎంతో చారిత్రాత్మక దినం అని వెల్లడించారు. రాష్ట్ర భవిష్యత్ ను నిర్దేశించే విజన్ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని, ఇందులో మనందరం భాగస్వాములం కావడం అదృష్టంగా భావించాలని తెలిపారు. చంద్రబాబు ఆవిష్కరించిన డాక్యుమెంట్ ఏదైతే ఉందో, అది కన్సల్టెంట్లు తయారు చేసిన పుస్తకం కాదు. దీనివెనుక చంద్రబాబు రాత్రింబవళ్లు పడిన శ్రమ ఉంది. సచివాలయంలో గంటల తరబడి ఉంటూ, భోజనం కూడా చేయకుండా, శాఖలవారీగా... ప్రజలకు ఏం కావాలన్నదానిపై ఆయన తన ఆలోచనలను విజన్ డాక్యుమెంట్ రూపంలో తీసుకువచ్చారు. చంద్రబాబు ఆలోచనలకు ప్రతిరూపమే ఈ విజన్ డాక్యుమెంట్-2047.

దేశంలో విజన్ డాక్యుమెంట్లకు మూల పురుషుడు ఎవరంటే మన ముఖ్యమంత్రి చంద్రబాబే. 1994లో ముఖ్యమంత్రి కాగానే విజన్-2020 డాక్యుమెంట్ తయారు చేస్తే, అప్పటి ప్రతిపక్ష నేతలు ఎంతో అపహాస్యం చేశారు. ఆనాడు ఐటీ విప్లవం అందిపుచ్చుకోవడానికి ఇంటర్నెట్ కావాలి అంటే... ఇంటర్నెట్ కాదు పంపు సెట్ కావాలన్నారు. ఇవాళ ఆ పంపు సెట్ నే ఇంటర్నెట్ ద్వారా నడిపే దశకు మనం చేరుకున్నామంటే అందుకు కారణం చంద్రబాబు. ఈ విజన్ డాక్యుమెంట్ అంటే ఏ కంప్యూటరో కాదు... కాడి పట్టిన రైతన్నకు ఏం కావాలి? పొలంలో పనిచేసే కూలీకి ఏం కావాలి? వారి పిల్లలకు ఏం కావాలి, వారు భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎలా ఎదగాలి అనేది ఆలోచన చేసేదే ఈ విజన్ డాక్యుమెంట్-2047. ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకోవాలని నాడు విజన్-2020లో పేర్కొంటే చాలామంది నవ్వారు. కానీ ఇవాళ దాని ఫలితాలు చూస్తున్నాం. ఆనాడు కేవలం 10 ఇంజినీరింగ్ కాలేజీలు ఉంటే, విజన్-2020 అనంతరం వాటి సంఖ్య 250కి పెరిగింది. అందులో చదువుకున్న పిల్లలు ఐటీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉపాధి పొందుతున్నారంటే అదీ విజన్ డాక్యుమెంట్. అమెరికాలో అత్యంత అధికంగా సంపాదించే వాళ్లు ఎవరంటే... మన తెలుగు పిల్లలే... అందుకు కారణం చంద్రబాబు విజన్-2020. ఆ విజన్ కు ప్రబల తార్కాణం హైదరాబాద్ రూపంలో మన కళ్ల ముందే ఉంది. దాని మీద కూడా అనేక భాష్యాలు చెప్పారు. నిజాం కట్టిన హైదరాబాద్ ను చూశాం... బ్రిటీష్ వాళ్లు ఏర్పరచిన సికింద్రాబాద్ ను చూశాం.... మన కళ్ల ముందు చంద్రబాబు తీసుకువచ్చిన సైబరాబాద్ ను ఇవాళ చూస్తున్నాం.... ఆ సైబరాబాద్ ఇచ్చిన లక్షల ఉద్యోగాలను కూడా చూస్తున్నాం... ఆ లక్షల ఉద్యోగాలతో బాగుపడిన మన కుటుంబాలను కూడా చూస్తున్నాం... అదీ విజన్ అంటే... అదీ నాయకత్వం అంటే! పరిపాలన అంటే ప్రజావేదికలను కుప్పకూల్చడం కాదు... పారిశ్రామికవేత్తలను తరిమేయడం కాదు... జల వనరుల ప్రాజెక్టులను నిలిపేయడం కాదు, రహదారులను గుంతలమయంగా చేయడం కాదు, పేదలను పట్టించుకోకపోవడం కాదు... అన్ని వర్గాలను అభివృద్ధి దిశగా నడిపించడమే నాయకత్వం. హైదరాబాద్ ఇవాళ ఒక విశ్వనగరంగా ఎదిగింది. ఆ నగర భవిష్యత్ ను తీర్చిదిద్దిన చంద్రబాబు మాత్రం ఒక యోగి లాగా నిర్లిప్తంగా తన పని తాను చేసుకుపోతున్నారు. ఈ రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలని కలలు కంటున్నారు. లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్న ఆ నాయకుడిని చూస్తుంటే చేతులెత్తి నమస్కారం చేయాలనిపిస్తుంది. మనందరం ఏడింటికి లేచి, పనులు చూసుకుని మళ్లీ రాత్రి తొమ్మిదింటికో, పదింటికో టీవీ చూసి పడుకుంటే... ఒక్క మనిషి మాత్రం ఈ రాష్ట్రం కోసం పనిచేస్తూనే ఉంటాడు. ఎన్నోసార్లు ఆయన సెక్రటేరియట్ లోనే రాత్రి భోజనం చేశారు. ఎవరి కోసం ఇదంతా! ఈ జీవితం అనేది ప్రజలకే అంకితం అని చంద్రబాబు నిశ్చయించుకున్నారు" అంటూ పయ్యావుల వివరించారు.

## చంద్రబాబుకు ఇదంతా అవసరమా అనిపిస్తుంది

- మొదటి పేజీ తరువాయి

విజన్-2047 డాక్యుమెంట్ విడుదల కార్యక్రమంలో భాగస్వామం కావడం తనకెంతో ఆనందం కలిగిస్తోందని పవన్ అన్నారు. యువకుడిగా ఉన్నప్పుడు ఎంతో సాధించాలని ఉండేదని, చాలా నేర్చుకోవాలనిపించేదని తెలిపారు. ఒక పది ఇరవై ఏళ్ల తర్వాత నువ్వు ఎలా ఉండాలనేది ముందుగా రాసిపెట్టుకోవాలని ఓ పుస్తకంలో చూశానని పవన్ వెల్లడించారు. ఒక పెద్ద నటుడ్ని అవ్వాలనో, బిజినెస్ మేన్ అవ్వాలనో, డాక్టర్ అవ్వాలనో రాసుకున్నప్పుడు చాలా హాస్యాస్పదంగా అనిపిస్తుంది... కానీ అది ఒక దిక్సూచి అని పేర్కొన్నారు. "చంద్రబాబు విజన్-2020 అన్నప్పుడు మాదాపూర్ లో మేం చూసింది రాళ్లు గుట్టలే. కానీ చంద్రబాబు సైబర్ సిటీని చూశారు. తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలు గుర్తు లేకపోవచ్చు కానీ... ఆ నిర్మాణం గుర్తుండిపోతుంది. అలాంటిదే సైబర్ సిటీ కూడా. ఈ రోజున ఇన్ని లక్షల మందికి ఉపాధి కల్పిస్తోన్న సైబర్ సిటీకి రూపకర్త చంద్రబాబే. ఇవాళ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరిస్తున్నప్పుడు మనసుకు చాలా తృప్తిగా అనిపించింది. కోట్ల మంది ప్రజలకు బలం ఇవ్వడానికి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇది బాటలు పరుస్తుంది. వ్యక్తి వ్యవస్థను నిర్మిస్తే... ఆ తర్వాత వ్యవస్థ వ్యక్తులను తయారుచేస్తుంది. చంద్రబాబు సుదీర్ఘ అనుభవం, నాయకత్వ సామర్థ్యం అమోఘమైనవి. నిద్రాహారాలు లేకుండా ఆయన పడే తపన చూస్తుంటే... ఆయనకు ఇదంతా అవసరమా అని చాలామందికి అనిపిస్తుంటుంది. ఓవైపు నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న పార్టీని నడిపించాలి... పార్టీ వ్యక్తుల్లో ఆశలు ఉంటాయి... వాటిని పరిగణనలోకి తీసుకోవాలి... మరోవైపు తన కుటుంబాన్నే కాకుండా ఐదు కోట్ల మంది ప్రజలు తన కుటుంబంలా చూసుకోవాలి... వారి అవసరాలు తీర్చాలి... ఇంకో వైపు రాజకీయ ప్రత్యర్థులు చేసే దాడులు తట్టుకోవాలి... ఇవన్నీ ఎదుర్కొంటూ నిలబడడం చంద్రబాబు ప్రత్యేకత.

ప్రధాని నరేంద్ర మోదీ వికసిత భారత్ గురించి ఆలోచిస్తుంటారు... దాన్లో విజన్-2047 కూడా ఓ అంతర్భాగం. ఒక వ్యక్తి కంటే కల... కోట్లాది మంది కలగంటే అది ఒక పరిపూర్ణ సంకల్పం... అదే మన స్వర్ణాంధ్ర విజన్-2047" అని పవన్ కల్యాణ్ వివరించారు.

# ఒక్కరోజే టాలీవుడ్ షేక్..

హైదరాబాద్: ఇద్దరు ప్రముఖ నటులు ఇవాళ వార్తల్లో నిలిచారు. బన్నీ అరెస్టు దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తోంది. ట్విట్టర్ లో ట్రెండింగ్ అవుతోంది. ఇదిలా ఉండగా ఇటీవల కుటుంబ వివాదం నేపథ్యంలో మీడియా ప్రతినిధిపై దాడి చేసిన సీనియర్ నటుడు మోహన్ బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ హైకోర్టులో రిజెక్ట్ అయ్యింది. దీంతో ఆయనను ఏ క్షణమైనా పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉంది. ఇవాళ ఉదయం ఆయన కోసం పహాడీ షరీఫ్ పోలీసులు ఫిలింనగర్, జల్ పల్లి నివాసాలకు వచ్చారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలన్న మోహన్ బాబు పిటిషన్ ను కొట్టేయడంతో ఆయనను పోలీసులు అరెస్టు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ఈ వివాదంలోకి పొలిటికల్ లీడర్లు ఎంట్రీ ఇచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్, వైసీపీ అల్లు అర్జున్ కు మద్దతుగా నిలిచాయి. చట్టం అందరికీ సమానమేనని, తన పని తాను చేసుకుపోతుందని కాంగ్రెస్ చెబుతోంది. అల్లు అర్జున్ ను అరెస్టు చేసిన పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నాంపల్లి కోర్టులో హాజరు పర్చగా కోర్టు 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. బన్నీ అరెస్టుపై బీఆర్ఎస్ నాయకులు ఫైర్ అవుతున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు స్పందిస్తూ.. 'జాతీయ అవార్డు పొందిన ఒక నటుడిని అరెస్టు చేసిన తీరు పాలకుల అభద్రతా భావానికి నిదర్శనం.' అని ట్వీట్లు చేశారు.

అల్లు అర్జున్‌ను సాధారణ నేరస్థుడిలా చూడటం సరికాదని పేర్కొన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా బన్నీ అరెస్టును తప్పు పట్టాడు 'కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలి. అల్లు అర్జున్‌కి గౌరవం ఇవ్వాలి. నేరస్తుడిగా ట్రీట్ చేయడం కరెక్ట్ కాదు.' అని పేర్కొన్నారు. 'భారతీయ సినిమాకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన నటుడి గౌరవం ఇవ్వాలి. సంధ్య టాకీస్ వద్ద జనాలను కంట్రోల్ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది. 'అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ట్వీట్ చేశాడు.

రాజకీయ నాయకులు ఒక న్యాయం.. నటులకు ఒక న్యాయమా..? బన్నీ అరెస్టు అన్యాయమని, ఈ విషయమై తాను హైకోర్టును ఆశ్రయిస్తానని కేఏ పాల్ అన్నారు. గోదావరి పుష్కరాల్లో తొక్కిసలాట జరిగి 29 మంది చనిపోతే , అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ను ఎందుకు అరెస్ట్ చేయలేదు అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు రాలు లక్ష్మీపార్వతి కూడా ఈ అంశంపై స్పందించారు. ఇది చంద్రబాబు నాయుడు కుట్ర అని పేర్కొన్నారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

- మొదటి పేజీ తరువాయి

(ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా రేపటికి ఉపరితల ఆవర్తనం విస్తరించే అవకాశం ఉందని, ఇది ఎల్లుండికి అల్పపీడనంగా బలపడుతుందని వివరించింది. ఇది అల్పపీడనంగా మారాక, తదుపరి 48 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తమిళనాడు తీరానికి చేరువగా వస్తుందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది.

అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 16న నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నెల 17న కోస్తా, రాయలసీమలో చాలా చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో, రైతులు వ్యవసాయ పనుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ సూచించింది.

## అల్లు అర్జున్ పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించలేదు

- మొదటి పేజీ తరువాయి

సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ స్పందించారు.

హీరో అల్లు అర్జున్ పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించలేదని స్పష్టం చేశారు. డ్రెస్ మార్చుకుంటానంటే అల్లు అర్జున్ తగినంత సమయం ఇచ్చామని వెల్లడించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు కూడా సమయం ఇచ్చామని తెలిపారు. అల్లు అర్జున్ బయటికి వచ్చాకే అరెస్ట్ చేశామని డీసీపీ వివరించారు. అల్లు అర్జున్ స్వయంగా వచ్చి పోలీసు వాహనంలో కూర్చున్నారని వెల్లడించారు.

## నా తొలి ప్రసంగం కంటే బెటర్

**పెన్ పవర్ డెస్క్:**లోక్ సభలో వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంక గాంధీ లోక్ సభలో తొలి ప్రసంగాన్ని రాహుల్ గాంధీ ప్రశంసించారు. శుక్రవారం (డిసెంబర్ 13) లోక్ సభ సమావేశాల్లో ప్రియాంక తొలి స్పీచ్ బాగుంది.. నా తొలి స్పీచ్ కంటే బెటర్ గా ఉందని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశంసలతో ముంచెత్తారు.

వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంక గాంధీ లోక్ సభలో తన తొలి ప్రసంగంతో అదరగొట్టారు.. తొలి స్పీచ్ లోనే ఎన్డీయే ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం..రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తుందని ఆరోపించింది. రాజ్యాంగం, రిజర్వేషన్లు, దేశ వ్యాప్తంగా కుల గణను చుట్టే తిరిగింది. భారత రాజ్యాంగం అంటే ఏందో ప్రధాని మోదీకి అర్థం కాదు..యూనియన్ రాజ్యాంగం అని అన్నారు ప్రియాంకగాంధీ.సంభాల్, మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనలపై ప్రధాని మోదీ స్పందించకపోవడంపై ప్రియాంకగాంధీ తప్పుబట్టారు. రాజ్యాంగం అంటే మోదీకి అర్థంకాలేదు.. రాజ్యాంగాన్ని మోదీ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రూల్‌బుక్ అని అనుకుంటున్నారని ప్రియాంకగాంధీ అన్నారు. సభలో రాజ్యాం గంపై చర్చలో పాల్గొన్న వయనాడ్ ఎంపీ , రాజ్యాంగం న్యాయం, ఐక్యత, భావప్రకటనా స్వేచ్ఛకు రక్షణకవచమని అన్నారు..గత పదేళ్లుగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్కవం రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. మరోవైపు గత లోక్ సభ ఎన్నికలపై ప్రియాంక గాంధీ విమర్శలు చేశారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి అధిక సీట్లు వస్తే..రాజ్యాంగాన్ని మార్చే ప్రక్రియ ప్రారంభించే వార ని ప్రియాంక గాంధీ అన్నారు. భారత రాజ్యాంగం అర్థం కాదు, యూనియన్ రాజ్యాంగం అని అన్నారు.

## రాజ్యాంగం ఓ ఒప్పందం.. సంఘ్ విధానం కాదు

- మొదటి పేజీ తరువాయి

ప్రియాంకగాంధీ.సంభాల్, మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనలపై ప్రధాని మోదీ స్పందించకపోవడంపై ప్రియాంకగాంధీ తప్పుబట్టారు. రాజ్యాంగం అంటే మోదీకి అర్థంకాలేదు.. రాజ్యాంగాన్ని మోదీ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రూల్‌బుక్ అని అనుకుంటున్నారని ప్రియాంకగాంధీ అన్నారు. రాజ్యాంగం ఆమోదించిన 75వ వార్షికోత్సవాన్ని గుర్తు చేసుకున్న చర్చలో .."రాజ్యాంగం ఓ రక్షణ కవచం.. దానిని ఎన్డీయే ప్రభుత్వం విచ్ఛిన్నం చేసేందుకు ప్రయ త్నిస్తోందని అన్నారు.

సభలో రాజ్యాం గంపై చర్చలో పాల్గొన్న వయనాడ్ ఎంపీ , రాజ్యాంగం న్యాయం, ఐక్యత, భావప్రకటనా స్వేచ్ఛకు రక్షణకవచమని అన్నారు..గత పదేళ్లుగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్కవం రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. మరోవైపు గత లోక్ సభ ఎన్నికలపై ప్రియాంక గాంధీ విమర్శలు చేశారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి అధిక సీట్లు వస్తే..రాజ్యాంగాన్ని మార్చే ప్రక్రియ ప్రారంభించే వారని ప్రియాంక గాంధీ అన్నారు. భారత రాజ్యాంగం అర్థం కాదు, యూనియన్ రాజ్యాంగం అని అన్నారు.

## చంద్రబాబుకో న్యాయమా..అల్లు అర్జున్ కు మరో న్యాయమా

- మొదటి పేజీ తరువాయి

పుష్కరాలు సహా వివిధ ఘటనల్లో జరిగిన తొక్కిసలాట కారణంగా కొంతమంది మృతి చెందితే చంద్రబాబును పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు సరే... మరి చంద్రబాబు కందుకూరులో ర్యాలీ నిర్వహించినప్పుడు 8 మంది, గుంటూరులో ముగ్గురు చనిపోయారన్నారు. 2019లో ఆయన పుష్కరాల్లో స్టంట్స్ చేస్తే 23 మంది చనిపోయారన్నారు. మరి చంద్రబాబును పోలీసులు అరెస్ట్ చేశారా? విచారణకు పిలిచారా? అని నిలదీశారు. బలవంతులైన రాజకీయ నేతలకు ఓ న్యాయం... సాధారణ వ్యక్తులు, నటులకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు.

## అనారోగ్యంతో సచివాలయ ఉద్యోగి మృతి

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, డిసెంబర్ 13.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలం బూసిపుట్టు సచివాలయ ఉద్యోగి గెమ్మెలి మోహిని అనారోగ్యంతో విశాఖపట్నం కెజిహెచ్ లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆమె బూసిపుట్టు సచివాలయంలో వెల్ఫర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. సహ ఉద్యోగి మృతి పట్ల ముంచంగిపుట్టు మండలం సచివాలయ ఉద్యోగులు విచారం వ్యక్తం చేశారు.



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# అన్నదాత నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పేడాడ రమణికుమారి






**ఎన్ఏడి, పెన్ పవర్, డిసెంబర్ 13 :** అన్నదాతకు అండగా నిరసన కార్యక్రమంలో డా. బి. ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు మరియు వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద కృష్ణ మందిరం నుండి పాదయాత్రగా రైతులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంనకు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో భవానీ శంకర్ కి ధాన్యం సేకరణలో వారికి జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తూ..ధాన్యం సేకరణలో వారికి కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేయడంతో పాటు, పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ. 20వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఇప్పటివరకు రైతులకు అందుతున్న ఉచిత పంటల బీమాను రైతులకు వర్తింప జేయాలన్న డిమాండ్ తో రైతులకు మద్దతుగా వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు,మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, నగర మేయర్ హరి వెంకటకుమారి, శాసనమండలి సభ్యురాలు మరియు వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీ రవీంద్ర బాబు, మాజీఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం





**పేకాట, కోడి పందాలపై నిఘా ఏర్పాట్లు**

**జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపిఎస్**

**ఎస్ రాయవరం, పెన్ పవర్, డిసెంబర్ 13 :** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపిఎస్ ఆదేశాల మేరకు ఎస్ రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పి ధర్మవరం అగ్రహారం గ్రామం శివార్లలో డిసెంబరు 13 న పేకాట ఆడుతున్న వారిపై ఎస్బీ ఇన్స్పెక్టర్ బాల సూర్యారావు, ఎస్ రాయవరం ఎస్సై విభీషణ రావు, ఎలమంచిలి రూరల్ ఎస్సై ఉపేంద్ర మరియు సిబ్బంది రైడ్ చేసి, పేకాట ఆడుతున్న 23 గురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి బెట్టింగులకు వినియోగిస్తున్న రూ. లక్ష 89వేల నగదు, 18 మొబైల్ ఫోన్లు మరియు 12 మోటార్ సైకిల్ లను సీజ్ చేశారు.

## ఆదివాసి ట్రస్ట్ నుండి గురుకులం కళాశాలకు మంచినీటి బోరు

# మంజూరు :- ట్రస్ట్ చైర్మన్ బాలం నాయుడు



**చింతపల్లిపెన్ పవర్ డిసెంబర్ 13:**-చింతపల్లి గురుకుల కళాశాలలో వనభోజనాల కార్యక్రమం జరిగింది ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ బాలమ నాయుడు పడాల్ ని గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ ఆహ్వానం మేరకు వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్నారు ప్రిన్సిపల్ రామేశ్వరం ట్రస్ట్ చైర్మన్ తో మాట్లాడుతూ, విద్యార్థులు దూర వ్యసనాలకు పాల్పడవద్దని, బాగా చదువుకొని,ఉన్నతాధికారులు కావాలని కోరారు కాలేజీలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉండి ఉన్నత అధికారులకు ఎన్ని లెటర్లు రాసిన సమస్య తీరలేదు ప్రిన్సిపాల్ గారు తెలిపినారు మంచినీరు సమస్యపై చర్చించడంజరిగింది ఆదివాసి ట్రస్ట్ నుంచి మంచినీటిబోరు తక్షణమే కళాశాలకు వేయడం జరుగుతుందని ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ బాలంనాయుడు ప్రిన్సిపాల్ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొనడం జరిగింది జరిగింది.

## మామిడిపల్లిలో రెండు నెలల శిశువు మృతి

## పై ఐసీడీఎస్ అధికారుల విచారణ:-

**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 13 :-** చింతపల్లి మండలంలోని మామిడిపల్లి గ్రామంలో రెండు నెలల శిశువు మృతి పై ఐసిడిఎస్ అధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం వివిధ పత్రికలలో వచ్చిన వార్త కథనాలకు స్పందించిన ఐసిడిఎస్ సిడిపిఓ జివి రమణి, స్థానిక సర్పంచ్ సోమరత్నం, వైస్ ఎంపీపీ తో కలిసి మామిడిపల్లి గ్రామాన్ని సందర్శించారు. చిన్నారి మృతి పై శిశువు తల్లి వంజరి ఈశ్వరి, తండ్రి గణపతి కుటుంబ సభ్యులను సిడిపిఓ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారి మృతికి తల్లిదండ్రుల నుండి సరైన సమాధానం రాలేదని సిడిపిఓ తెలిపారు విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలల శిశువుకి ఉదయం వ్యాక్సిన్ వేయడం జరిగిందని సాయంత్రం వరకు శిశు ఉత్సాహంగా ఆడుకుందన్నారు. శిశువుకి జ్వరం వచ్చిందని సాయంత్రం దిష్టి తీసి సాంప్రదాయ వైద్యం చేశారన్నారు ఈ కారణంగానే శిశువు తీవ్ర అస్వస్థకు గురై మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. శిశువు మృతికి సంబంధించి పూర్తి వివరాలు వైద్యాధికారి విచారణలో తెలుస్తుందన్నారు. గిరిజనులు చిన్నారులకు పసర మందులు వంటివి పట్టడం నాటు వైద్యం చేయడం వంటివి చేయరాదన్నారు. చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్య నిపుణులు ఉన్నారని ప్రభుత్వ వైద్య సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేగాని మూఢనమ్మకాలతో పసరు మందులు వంటివివాడి ప్రాణాల మీదకుతెచ్చుకో రాదన్నారు. ఈకార్యక్రమంలో



ఐసిడిఎస్ సూపర్వైజర్, ఏఎన్ఎం పాల్గొన్నారు

# రెవిన్యూ సదస్సులతో భూ సమస్యల శాశ్వత పరిష్కారం...!

● మాజీ జిసిసి ఛైర్మెన్ ఎంవివి ప్రసాద్.



**కొయ్యూరు,పెన్ పవర్ డిసెంబర్ 13:** దీర్ఘకాలికంగా పేరుకుపోయి ఉన్న భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న రెవెన్యూ సదస్సులు ప్రజలకు చక్కటి వేదికని భూ స్వాములను, వివాదాలతో ఇబ్బంది పడేవారికి మంచి అవకాశం అని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జిసిసి ఛైర్మెన్ ఎంవివి ప్రసాద్ అన్నారు. మండలం కేంద్రమైన రాజేంద్రపాలెంలో శుక్రవారం తహసీల్దార్ ఎస్ ఎల్ వి ప్రసాద్, స్థానిక సర్పంచ్ పిటాసింహాచలం కూటమి నాయకుల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలపై పరిష్కారం చేయాలంటూ పలువురు తెలియజేసారు. కొందరు వినతి పాత్రలను అందజేశారు. అనంతరం సదస్సు లో ఎంవివిప్రసాద్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తుందని వీటి ద్వారా శాశ్వత పరిష్కారం అయ్యేందుకు ఏదోక సదవకాశంగా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రసాద్ అన్నారు. ఈ సదస్సు లో తహసీల్దార్ ఎస్ఎల్వి ప్రసాద్, డిప్యూటీ తాసిల్దార్ కుమారస్వామి, ఆర్ ఎస్ డి టి అప్పన్న, ఆర్ఐ దొర, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, ఖాన్, మేడిబోయిన చిన్న , సచివాలయం సిబ్బంది, విఆర్ఓసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# 87వ వార్డు లో గణేష్ నగర్ లో రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్ పర్యటన...

● శిధిలావస్థ చేరిన రోడ్లను, కాలువలను పరిశీలాన

● తక్షణమే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని ఆదేశం





**గాజువాక : పెన్ పవర్, డిసెంబర్ 13:**గాజువాక నియోజకవర్గం 87వ వార్డు పరిధిలో గణేష్ నగర్ లో రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం జగన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్దె ద్యేయంగా ప్రతిరోజు వార్డులో ఉన్న ఒక ప్రాంతాన్ని సందర్శించి వారి సమస్యలను తెలుసుకునే ఆలోచనలో భాగంగా ముందుగా గణేష్ నగర్ ప్రాంతాన్ని సందర్శించి అక్కడ శిథిలావస్థకు చేరిన కాలవలను,రోడ్లను, పార్కులను పరిశీలించి తక్షణమే సంబంధిత అధికారులతో చర్చించి వాటికి ఎస్టిమేషన్ వేయించి పనులను ప్రారంభించాలని సిబ్బందిని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రాజన్ రాజ్, అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు,ఆనంద్ కుమార్, కనక సత్యం, కళ్యాణ్ చక్రవర్తి, కాలనీ అసోసియేషన్, సచివాలయం సిబ్బంది, శానిటరీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఫ్రైడే డ్రైడే 74వ వార్డు లో మార్వెల్ స్కూల్ ఆవరణంలో జరిగినది



**గాజువాక పెన్ పవర్, డిసెంబర్ 13:**జీవీఎంసీ 74 వ వార్డు మార్వెల్ స్కూల్ ఆవరణంలో ఫ్రైడే డ్రైడే మలేరియా. డెంగ్యూ. చికెన్ గున్యా అవగాహన కార్యక్రమం జరిగినది దీనికి ముఖ్యఅతిథిగా 74 వ వార్డు కార్పొరేటర్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశి రెడ్డి పాల్గొని అవగాహన మీద మాట్లాడుతూ మలేరియా. డెంగ్యూ. చికెన్ గున్యా అనేది ఒక్కదోమ కాటు వల్ల వస్తుంది కావున మనమందరము మన ఇంటి పక్కన శుభ్రంగా ఉంచుకోవాలి చెత్తగాన్ని తడిగాని ఉండకుండా చూసుకోవాలా అలాగే ప్లాస్టిక్ కవర్లు వాడరాదు గుడ్డ సంచులో మాత్రమే వాడుకోవాలి అని అవగాహన మీద మాట్లాడారు ఈ కార్యక్రమంలో జోన్ 6 జోనల్ కమిషనర్ బి ఆర్ ఎస్ శేషాద్రి. బయాలజిస్ట్ సాంబమూర్తి. శానిటరీ ఇన్స్పెక్టర్ నర్సింగరావు. స్కూల్ ప్రిన్సిపల్ నరసింహారెడ్డి. కొండబాబు. గంగరాజు. శ్రీను. సింహాద్రి. జీ వి ఎం సి సిబ్బంది. సచివాలయం సిబ్బంది. ఈ ఫ్రైడే డ్రై డే అవగాహన సదస్సులో పాల్గొన్నారు

# రోడ్డెక్కిన "విద్యార్థులు "... స్పందించని అధికారులు...!

● ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో విద్యార్థుల నిరసన ప్రదర్శన



**కొయ్యూరు, పెన్ పవర్ డిసెంబర్ 13:** గురుకుల కళాశాల, పాఠశాలల్లోని అవుట్సోర్సింగ్ గురువులు గత నెల రోజులుగా సమ్మె బాట పట్టడంతో, విద్యాబోధన లేక విద్యార్థులు రోడ్డు ఎక్కారు. శుక్రవారం కొయ్యూరు గురుకుల పాఠశాల, కళాశాల లోని విద్యార్థులు తమ ఉపాధ్యాయులను, అధ్యాపకులను విద్యాలయాలకు రప్పించాలంటూ, తమకు విద్యాబోధన పునరుద్ధరించాలంటూ ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో రోడ్డుపై బైఠాయించి నిరసనగళం వినిపించారు. తమ టీచర్స్ సమస్యను పరిష్కారం చేసి, వెంటనే తమ టీచర్స్ ను పంపించాలంటూ రోడ్డెక్కిన విద్యార్థులు, ఒక అడుగు ముందుకేసి ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే కళాశాల, పాఠశాలలను విడిచిపెట్టి తమ స్వ గ్రామాలకు వెళ్ళిపోతామని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను ఎస్ఎఫ్ఐ నేతలతో కలిసి డిమాండ్ చేసారు. గురుకుల కళాశాల, పాఠశాలలో సుమారుగా టీచర్స్ లేకుండా 28 రోజులు కావస్తున్నా,గురుకుల విద్యాసంస్థల్లో టీచర్ సమస్యలను తీర్చలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే విద్యార్థులకు టీచర్స్ ను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పాంగి జీవన్ కృష్ణ డిమాండ్ చేశారు.గురుకుల కళాశాలలో పాఠశాలల్లో 15 సంవత్సరాలు సర్వీస్ ఉన్న అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులను సిఆర్టి లు గా మార్చి వెంటనే కళాశాల, పాఠశాలల్లోనికి ఉపాధ్యాయులను ఐటిడిఎ అధికారులు పంపించాలంటూ, లేకపోతే విద్యార్థిని విద్యార్థులతో రోడ్డు మీదకిఎక్కి ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని ఐటిడిఎ అధికారులను రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సూరిబాబు డిమాండ్ చేశారు.లేదంటే గురుకుల విద్యార్థులతో ఉద్యమం ఉధృతం చేస్తామంటూ ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షులు సూరిబాబు అన్నారు. విద్యార్థుల సమస్యలను తీర్చాలంటూ సుమారుగా గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 28 రోజులు రోడ్డు మీద కూర్చొని ఉంటే ఐటీడీఏ అధికారులు కనీస స్పందన లేనట్టు వ్యవహరిస్తున్న అధికారుల వైఖరిని వెనక్కి తీసుకోవాలన్నారు.వెంటనే గురుకుల ఉపాధ్యాయులను సీఆర్టీలుగా విధుల్లోనికి తీసుకోవాలంటూ ఎస్ఎఫ్ఐ గిరిజన సంఘం డిమాండ్ చేస్తూ, శుక్రవారం ఉయ్యూరు గురుకుల పాఠశాల ఎదుట సుమారుగా 500 మంది విద్యార్థులతో ధర్నా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణ, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సూరిబాబు విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం, పోషకాహారం పై వార్డులో అవగాహన సదస్సు



**గాజువాక: పెన్ పవర్ డిసెంబర్ 13:**జీవీఎంసీ 66 వార్డులో ఏఎన్ఎం ఆధ్వర్యంలో యు హెచ్ ఎస్ ఎన్ సి మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగినది అర్బన్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ కమిటీ ఆధ్వర్యంలో అజిమాబాదు శివాజీ నగర్ ఏరియాలో ఈ క్రింది విషయాల గురించి చర్చించడం జరిగినది ముఖ్యంగా త్రాగునీరు సౌకర్యాల గురించి అలాగే పారిశుధ్యం కార్యక్రమాల గురించి గర్భవతులు బాలింతలు గురించి ఫ్రైడే డ్రై డే గురించి మరియు ఎన్సీడీ, సిడి ప్రోగ్రామ్స్ గురించి మరియు కాలానుగుణంగా వచ్చే వ్యాధుల గురించి చర్చించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 66వ వార్డు మాజీ కార్పొరేటర్ 66 వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మహమ్మద్ రఫీ గారు పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా కాలానుగుణంగా వచ్చే వ్యాధుల గురించి తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని కలుషితమైన నీరు తీసుకోరాదని మన ప్రాంతంలో శానిటేషన్ బాగుండాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేకపోతే అనారోగ్య బారిన పడతారని ఏఎన్ఎంలు పారిశుద్ధ సిబ్బంది చెప్పే విధంగా పరిసరాలతో పాటు మన ఇల్లు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని చిన్నపిల్లలకి గాని పెద్దలకు గాని సోకకుండా జాగ్రత్త పడాలని చెప్పారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పద్మిని మరియు తెలుగుదేశం పార్టీ వార్డు మాజీ అధ్యక్షులు స్వర్ణపుడి సత్యనారాయణ లకోజి లక్ష్మణరావు లీలారాణి స్వర్ణపుడి రాంబాయి జయలక్ష్మి అన్నపూర్ణ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు

# టిడిపి పరిపాలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్న కేజిఆర్





**గాజువాక పెన్ పవర్, డిసెంబర్ 13:** పారిశ్రామిక ప్రాంతం గాజువాక వెంకటేశ్వర కాలనీలో ఉన్న సచివాలయంలో ప్రజలు ఏ సేవలు వినియోగించుకున్నారో వచ్చిన లబ్ధిదారులని అడిగి తెలుసుకున్నారు.

షీలానగర్ లో ఉన్న సచివాలయానికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉండి సచివాలయానికి ఎవరెవరు వస్తున్నారు ఏ సేవలు వినియోగించుకుంటున్నారు అన్నదానిపై అడిగి తెలుసుకున్నారు.

సచివాలయానికి ఈరోజు ఇద్దరూ లబ్ధిదారులు వచ్చి కేవలం ఫీజు రియంబర్స్మెంట్ గురుంచి అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి. సచివాలయంలో సంబంధించిన ఉద్యోగులు ప్రజలకు ఎంతవరకు సేవలు అందిస్తున్నారు అడిగే తెలుసుకున్న ప్రయత్నం చేశారు.

# గిరిజన ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ లో మరొక ప్రాణం బలి




● విద్యార్థిని మృతికి స్కూల్ హెచ్ఎం,వార్డెన్ నిర్లక్ష్యమే కారణం.

● విద్యార్థినికి దయ్యం పట్టిందని దారుణంగా కొట్టిన వార్డెన్.

**పాడేరు,పెన్ పవర్, డిసెంబర్13.**మృతిచెందిన మర్ల సత్యవతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లించాలి.తాటిపర్తి స్కూల్ హెచ్ఎం, వార్డులను తక్షణమే సస్పెండ్ చేయాలి:ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ డిమాండ్.తాటిపర్తి స్కూల్ 9వ తరగతి చదువుతున్న మర్ల సత్యవతి గత ఐదు రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ ఈరోజు ఉదయం చోడవరం ప్రైవేట్ హాస్పిటల్ లో మృతి చెందింది. ఐదు రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతూ స్కూల్లో దొర్లు దొర్లు ఏడుస్తున్న కనీసం స్కూల్ యాజమాన్యం పట్టించుకోకుండా,విద్యార్థినికి దయ్యం పట్టిందని తీవ్రంగా కొట్టిన ,వార్డెన్, నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్.ఎం ను తక్షణమే సస్పెండ్ చేసి మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని ,ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మర్ల సత్యవతి సోమవారం నుండి కడుపునొప్పితో బాధపడుతున్నప్పటికీ కనీసం స్కూల్ యాజమాన్యం పట్టించుకోకుండా, ఆసుపత్రుల్లో చేర్పించ కుండా విద్యార్థినికి దెయ్యం పట్టిందని వార్డెన్ కొట్టడంతో, హెచ్ఎం నిర్లక్ష్యంతోనే విద్యార్థిని మృతి చెందిందని, తమ కూతురు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలుసుకున్న తల్లితండ్రులు స్కూలుకి రావడంతో పరిస్థితి విషమించటంతో నిన్న 11 గంటల సమయంలో మాడుగుల ఆసుపత్రికి తీసుకువెళ్లాగా మేమేం చేయలేము అని చేతులెత్తయగా, ఈరోజు ఉదయం చోడవరం ప్రైవేట్ ఆస్పత్రిలో ఉదయం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ తమ కూతురు మృతి చెందిందని, ఇంత జరిగినా కూడా కనీసం ఆసుపత్రిలో కూడా స్కూల్ యాజమాన్యం రాలేదని కుటుంబ సభ్యులు వాపోయారు. కేవలం పాడేరు ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్యం వల్లనే విద్యార్థులు రోజురోజుకీ విద్యార్థుల మరణాలు సంఖ్య పెరుగుతుందని, కనీసం ఎందుకు చనిపోయారో విచారణ చేయాలని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించి,

విద్యార్థిని మృతి పై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వార్డెన్, హెచ్ఎంల పై తక్షణమే అనకాపల్లి జిల్లా కలెక్టర్ గారు చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వంతల కృష్ణ, గిరిజన సమాఖ్య నాయకులు పాంగి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ జీవీఎంసీ కౌన్సిలర్ మెంబర్ కాకి గోవింద రెడ్డి సచివాలయం సిబ్బందికి క్షమాపణ చెప్పాలి

● నల్ల రిబ్బన్లు ధరించి విధుల్లో పాల్గొన్న సచివాలయం సిబ్బంది



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, డిసెంబర్13:** విశాఖపట్నం జీవీఎంసీ కౌన్సిల్ మెంబర్ ఆయన కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది మీద అనుచిత వాక్యాలు చేయటంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది ముక్తకంఠంతో ఆయన వాక్యాలను ఖండిస్తూ నిరసన తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా గూడెం కొత్తవీధి మండలంలోని అన్ని పంచాయతీలలో గల సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు కాకి గోవింద రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని, ఆయన మాట్లాడిన అనుచిత వాక్యాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించటం జరిగింది. నల్ల రిబ్బన్లు ధరించి గూడెం కొత్త వీధి మండలంలోని సచివాలయం ఉద్యోగులు విధుల్లో పాల్గొన్నారు.

# శ్రీ బంగారమ్మ అమ్మవారి విగ్ర ప్రతిష్టలో పాల్గొన్న ఈవో దంపతులు





**సింహాచలం, పెన్ పవర్, డిసెంబర్ 13 :** శ్రీ వరహ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలం ఉపాలయం, అడివివరం గ్రామ దేవత శ్రీ బంగారమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ ఉత్సవం శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు వేడుకలో ఈఓ వి.త్రినాథరావు దంపతులు పాల్గొన్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ రమణ మూర్తి, ఈఈ రాంబాబు, ఏఈలు డిఇ హరిరాజు, రావురాజు, పిఆర్వో నాయుడు, అమ్మవారి పూజారుల వంశీయులు లండ వెంకట రమణ భక్తులు పాల్గొన్నారు.15 వ తేదీన అమ్మవారి విగ్రహం, ఆలయ శిఖరం కలశ స్థాపన జరగనున్నాయి.

# ప్రతి ఒక్కరికి రక్తదానం అవయవ దానం పై అవగాహన అవసరం





- మరణించిన.. జీవించండి వాల్ పోస్టర్ డాక్టర్ వినయ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరణ
- అల్లూరి జిల్లా కార్యదర్శి మడపల సోమేష్ కుమార్

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, డిసెంబర్ 13:** అఖిలభారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం గూడెం కొత్త వీధి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ కే వినయ్ కుమార్ చేతుల మీదుగా మరణించినా.. జీవించండి అనే వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు అపోహలు వీడి రక్తదానం అవయవ దానం పై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం అన్నారు. అల్లూరి జిల్లా కార్యదర్శి సోమేశ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అపోహలు కట్టుబాట్లు మూడావిశ్వాసాలు వీడి సైన్స్ పరంగా జ్ఞానం కలిగి ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మన శరీరం మట్టిలో కలవకుండా, మంటల్లో బూడిద అవ్వకుండా అవయవాలు దానం చేసి మరణానంతరం కూడా మరొకరిలో జీవించాలని, నేత్రాదానంతో అంధులకు చూపులు ఇవ్వవచ్చు అని అన్నారు. పార్దివ దేహ దానం ఒక గొప్ప మహోన్నతమైన దానం.సమాజానికి మనకి మనం ఇచ్చుకునే గొప్ప దానం అని కొనియాడారు.బావి భారత వైద్యులకు మానవ శరీర అవయవ నిర్మాణం, శాస్త్ర చికిత్స యందు నైపుణ్యం పెంపొందించుకొనుటకు మరణానంతరం మెడికల్ కాలేజీకి మన శరీరాన్ని 24 గంటల లోపు దానం చేయవచ్చునని తెలుపుతూ అవగాహన కల్పించారు. అవయవ దానం చేయాలనుకునేవారు జీవన్ దాన్ వెబ్సైట్లో లాగిన్ అయ్యి తమ వివరాలను నమోదు చేసుకోవాలని, అలాగే సెంట్రల్ గవర్నమెంట్ వెబ్సైట్ నందు నమోదు చేసుకునే వారికి ఆధార్ నెంబర్ కు మొబైల్ నెంబర్ లింక్ అయి ఉండాలని రెండు నిమిషాలలో ప్రతిజ్ఞ సర్టిఫికెట్ వస్తుందని తెలిపారు. సలహాలు మరియు సందేశాలు ఏమైనా ఉంటే9493738861,9490681063 నంబర్లకు ఫోన్ చేసి తనను సంప్రదించవచ్చు అని అల్లూరి జిల్లా కార్యదర్శి, మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు మడపల సోమేశ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జికే విధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కుమార్, చిన్ని, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ కౌన్సిల్ మెంబర్ ఆయన కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి క్షమాపణ చెప్పాలి

- హుకుంపేట ఎంపీడీవో కార్యాలయంలో నిరసన తెలిపిన సచివాలయం సిబ్బంది



**హుకుంపేట,పెన్ పవర్, డిసెంబర్ 13:** ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల చెంతకు చేరవేస్తున్న సచివాలయం ఉద్యోగులను అనగా గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల యొక్క ఆత్మగౌరవాన్ని భంగం కలిగిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన విశాఖపట్నం జీవీఎంసీ కౌన్సిల్ మెంబర్ అయినా కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి క్షమాపణ చెప్పాలని, ఆయన వాక్యానించిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ హుకుంపేట ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయం ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేయడం జరిగింది.

## ఎమ్మెల్సీ కుంభ రవిబాబును మర్యాదపూర్వకంగా వంచుల పంచాయతీ వైసిపి నాయకులు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, డిసెంబర్ 13:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీ వైసీపీ నాయకులు శుక్రవారం పాడేరులో అన్నదాతకు అండగా కార్యక్రమంలో భాగంగా నిరసన కార్యక్రమం అనంతరం ఎమ్మెల్సీ కుంభ రవిబాబును వంచుల సర్పంచ్ వనపల కాసులమ్మ భర్త వనపల రాజేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రవిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవిబాబు వారి యొక్క యోగక్షేమాలు అడిగి తెలుసుకుని పార్టీ అభివృద్ధికి నిరంతరం సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అరడ సత్తిబాబు,పోత్తూరు గంగరాజు, జానకిరామ్, గెమ్మెలి జోగిరాజు, కొర్ర రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం.





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, డిసెంబర్ 13:**రెవెన్యూ సదస్సులో రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి ముందుకు వస్తున్నారని తాహసిల్దార్ టి.రామకృష్ణ తెలిపారు.శుక్రవారం గూడెం కొత్తవీధి మండలంలో దేవరపల్లి,లక్కవరపుపేట పంచాయతీలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాలలో భూ సమస్యలు పరిష్కారం కాకుండా అలాగే ఉన్నాయని వాటిని పరిష్కరించుకోవడానికి రైతులు భూ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేస్తున్నారన్నారు. దేవరపల్లి పంచాయతీలో మంగలపాలెం గ్రామంలో భూములు కలిగిన రైతులకు ఎన్నో ఏళ్లుగా వెబ్లాండ్ లో నమోదు కాలేదని అందువల్ల రైతులు ప్రభుత్వ పథకాలు పొందలేక నష్టపోయారని తెలిపారు.రెవెన్యూ సదస్సు మొదటి రోజున భూ సమస్యలు అర్జీల రూపంలో వెల్లువెత్తాయని చెప్పారు.రైతులు తెలిపిన భూ సమస్యలు 30 రోజుల్లో పరిష్కారం చేస్తామని తహశీల్దార్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో ఎక్కువగా వెబ్లాండ్ నమోదు,మ్యుటేషన్ సమస్యలు గుర్తించామని తెలిపారు.కొడిసింగి, ఎర్రచెరువులు,తూరుమామిడి,సంపంగి గొంది గ్రామాల రైతులు లక్కవరపేటలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు తెలియజేసారని తెలిపారు.భూ సమస్యలపై దరఖాస్తు ఇచ్చిన వెంటనే సంబంధిత రిజిస్టర్ల లో నమోదు చేసి రైతులకు రసీదులు ఇచ్చి భూ సమస్య పరిష్కార చర్యలు చేపడుతున్నారు.రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుంటున్నారని తాహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాలసుందరం బాబు, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ దుమంతి సత్యనారాయణ, ఆర్ఐ మహాదేవ్, దేవరపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, టిడిపి పార్టీ నాయకుడు మొట్టడం రామకృష్ణ, వీఆర్వోలు భారతి,మేఘశ్యామ్, వీఆర్ఏ పసుపులేటి సూర్యనారాయణ పాల్గొన్నారు.



## రైతులుకు అండగా వై.ఎస్.ఆర్.సి.పి నేతలు పోరుబాట.

అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేత.



**అనకాపల్లి (పెన్ పవర్) డిసెంబర్ 13:** అనకాపల్లి జిల్లా లో వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు "అన్నదాత కు అండగా వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ" అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పోరుబాట పట్టారు. వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో అన్నదాతల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టరేట్ వరకు రైతులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ర్యాలీతో కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తూ పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాయింట్ కలెక్టర్ జాహ్నవి కలిసి వినతి పత్రం అందజేసారు. వైసిపి జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాల నాయుడు , మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్ రాజ్, కరణం ధర్మ శ్రీ, కన్నబాబు రాజు, అనకాపల్లి మాజీ ఎంపీ బిసెట్టి సత్యవతి, పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు, వై.సి.పి రాష్ట్ర అధికార ప్రతినిధి బొడ్డెడ ప్రసాద్, రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, పరవాడ జడ్పిటిసి పిఎస్ రాజు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, దంతులూరి దిలీప్ కుమార్ తదితర నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సూపర్ సిక్స్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందుతుందని రైతులు ఆశించారని, అయితే రెండు వ్యవసాయ సీజన్లు గడిచిపోతున్నా కూటమి సర్కారు పైసా సాయం కూడా జమ చేయలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం కింద రూ10,718 కోట్లు చెల్లించాల్సి ఉండగా బడ్జెట్లో రూ.1000 కోట్లే విదిలించిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. మరోవైపు పంటల బీమా ప్రీమియం బకాయిలను ఎగ్గొట్టి రైతులకు దక్కాల్సిన రూ.1,385 కోట్ల పంటల బీమా పరిహారాన్ని అందకుండా చేసిందన్నారు.సున్నా వడ్డీ రాయితీ కింద రూ.131.68 కోట్ల కనీసం దాని ఊసే ఎత్తడం లేదని రబీలో కరువు సాయం బకాయిలు రూ.319.59 కోట్లు ఎగ్గొట్టిందని అన్నారు. ఖరీఫ్ ధాన్యాన్ని కొనే నాథుడు లేక రైతులు అల్లాడిపోతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్నెల్లలోనే రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ఐదేళ్ల పాటు వెన్నుదన్నుగా నిలిచిన వైఎస్సార్ ఉచిత పంటల బీమాను కూటమి సర్కారు రాగానే అటకెక్కించడంతో ఆ భారం భరించలేక, బ్యాంకుల చుట్టూ తిరగలేక, అవస్థలు పడలేక అన్నదాతలు పంటల బీమాకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏకంగా 70 మంది వరకు రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడగా ఏ ఒక్కరికీ ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకోలేదని ఆరోపించారు. తడిసిన,రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తేమలక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని రైతులపై అదనపు భారం మోపే చర్యలు మానుకోవాలని హితవు పలికారు. రైతుల సమస్యను పరిష్కరించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రైతుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని ప్రకటించారు.

## జడ్పీ నిధులతో గొందిపాకల పంచాయతీలో త్రాగునీటి బోర్ నిర్మాణం:- ఎంపీటీసీ సభ్యుడు మోహన్ రావు.

**చింతపల్లిపెన్ పవర్ డిసెంబర్ 13:-** త్రాగునీటి బోర్ నిర్మాణాన్ని గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని గొందిపాకలు ఎంపీటీసీ సభ్యుడు తాంబేలి మోహన్ రావు అన్నారు. పంచాయతీ పరిధిలోని తాడిపాలెం గ్రామంలో జిల్లాపరిషత్ నిధులతో మంజూరు కాబడిన త్రాగునీటి బోరు నిర్మాణానికి గ్రామస్తులతో కలసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరి గ్రామాలలో నీటి వనరులు ఉన్నప్పటికీ గిరి గ్రామాల ప్రజలు త్రాగునీటి కోసం తహతహలాడే పరిస్థితులు ఉన్నాయన్నారు. రక్షిత త్రాగునీరు లేక గతంలో అనేకమంది నీటి సంబంధిత వ్యాధుల బారిన పడి, మృత్యువాత పడిన సందర్భాలు లేకపోలేదన్నారు. వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని నేడు జిల్లా పరిషత్ నిధులతో గిరి గ్రామాలలో త్రాగునీటి కల్పనకు బోర్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అడిగిన వెంటనే బోర్లు మంజూరు చేసిన ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, స్థానిక జడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఎంపీపీ కోరాబు అనూష దేవి లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు



## "నవనిర్మాణ సమితి" మంచినీటి ట్యాంకుల ప్రారంభం



**కొయ్యూరు, పెన్ పవర్ డిసెంబర్ 13:** మండలంలోని బూదరాళ్ల పంచాయతీలో విశాఖజిల్లా నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీటి ట్యాంకులను శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని బూదరాళ్ల పంచాయితీ పరిధిలో చౌడుపల్లి, లోయలపాలెం గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంక్స్ ని స్థానిక సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీమతి కరుణ, ఆర్డబ్ల్యూఎస్ జెయి, సాయి కృష్ణ, నవ నిర్మాణ సమితి ప్రాజెక్ట్ మేనేజర్ సన్యాసిరావు, ఏడ్వాకసి మేనేజర్ రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ వేణు గోపాల్, సిబ్బంది, వార్డ్ సభ్యులు సాగిన సంజీవ్, ఎంపీటీసీ వంతలనారాయణ, రెండు గ్రామాల పెద్దలు, మహిళలు, యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పంచాయితీల్లో అభివృద్ధే లక్ష్యంగా సర్వే చేసి ప్రతిపాదనలు ఇవ్వండి.

- రెండు రోజుల సచివాలయ సిబ్బంది శిక్షణ లో ఎంపీపీ, ఎంపిడిఓ .



**కొయ్యూరు,పెన్ పవర్ డిసెంబర్ 13:**గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రానున్న 2024- 25 లో గ్రామాల్లో తగిన అభివృద్ధి పనుల కల్పనే లక్ష్యంగా సర్వే చేసి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీపీ రమేష్ బాబు, ఎంపీడీవో ఎస్.కెవి ప్రసాద్ లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు, సర్పంచ్ లకు, సెక్రెటరీ, ఇతర సచివాలయ సిబ్బందికి ఇచ్చిన శిక్షణ శుక్రవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ రమేష్ బాబు మాట్లాడుతూ... సానికంగా పేదరికాన్ని నిర్మూలించే క్రమంలో అభివృద్ధిని సాధించేందుకు ప్రజలు మూఢనమ్మకాలను విడనాడాలని అన్నారు. విద్యా, వైద్య కల్పనతో పాటు గ్రామాల్లో తగిన మౌలిక సౌకర్యాలను కల్పించటం ద్వారా ప్రజలు అభివృద్ధి చెందినట్టు అవుతుందని ఎంపిడిఓ ప్రసాద్ అన్నారు. రెండు రోజుల శిక్షణ అనంతరం సర్పంచ్ లు, సెక్రటరీ లు, ఇతర సచివాలయం సిబ్బంది గుర్తింపుగా ఫోటో దిగారు. ఈ ముగింపు సమావేశంలో ఎంపీపీ రమేష్ బాబు తో పాటు ఎంపీడీవో ప్రసాద్, పరిపాలన అధికారి బాలమురళీకృష్ణ, అర్ డబ్ల్యు ఎస్ జే ఈ సాయి కృష్ణ, సిడిపిఓ విజయకుమారి, అంగన్వాడీ సూపర్వైజర్స్,33 పంచాయితీల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ సర్పంచ్ లు పాల్గొన్నారు.

## బొండ్రుగూడలో జెడ్పీ నిధులతో సిసి రోడ్డు నిర్మాణం

- ఐదు లక్షల నిధులతో 110 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం
- పంచాయతి సర్పంచ్ దొర నీలకంఠం, ఎంపీటీసీ భజంగి కమల.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, డిసెంబర్ 13.**
మండలంలో గల జోలపుట్టు పంచాయితీ బొండ్రుగూడ గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు పంచాయతీ సర్పంచ్ దొర నీలకంఠం ఎంపిటిసి భజంగి కమల తెలిపారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం పాత్రికేయులతో మాట్లాడుతూ.. బొండ్రుగూడ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సిసి రోడ్డు మంజూరు కొరకు జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లామని, ఆమె స్పందిస్తూ సిసి రోడ్డు నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేశారని అన్నారు. ఆ నిధులతో గ్రామంలో 110 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని వారన్నారు. గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన చైర్పర్సన్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు జల్ల దామోదరం, ప్రధాని శుక్ర, దొర మొంగు తదితరులు పాల్గొన్నారు.

# చింతపల్లిమండలంలోతెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం



చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 13:– తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎర్ర బొమ్మల పంచాయతీ లో శర వేగంగా జరుగుతోంది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు మామిడి రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో నిర్దేశించుకున్న టార్గెట్ లు పూర్తి చేసేందుకు నాయకులు, పార్టీ శ్రేణులు రేయింభవళ్ళు శ్రమిస్తున్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి అయిన శుభ సందర్భంలో కుదుపు శింగి గ్రామంలో శుక్రవారం ఆ పార్టీ యువ నాయకుడు మామిడి చినరాజు సభ్యత్వ నమోదును శర వేగంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ వంద రూపాయలతో పొందే ఈ సభ్యత్వం అటు పార్టీ సభ్యునిగా గుర్తింపు పొందేందుకే గాక, ఎటువంటి విపత్కర పరిస్థితుల్లో నైనా పార్టీ ద్వారా అండగా, ఆర్థిక రక్షణగా ఉండేందుకు ఉపయోగపడుతుందన్నారు. . ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు మాధవ రావు, జర్త రమేష్, మురళి లోవరాజు, మహిళలు పాల్గొన్నారు

# విద్యుత్ బిల్లులను తగలబెట్టిన సిపిఎం

- అరకు మండల కమిటీ .




అరకులోయ పెన్ పవర్ 13: సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, పేదలపై విపరీతమైన విద్యుత్ బారాలు పిక్స్డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు ,విద్యుత్ డ్యూటీ చార్జీలు, సర్దుబాటు చార్జీలు వంటి పేర్లతో సామాన్య గృహ వినియోగదారులపై రోజురోజుకీ మోయలేని విద్యుత్ బారాలు మోపుతూ బడా పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సామాన్య ప్రజలకు తీవ్రమైన
భారంగా మారింది. అతి తక్కువ ఛార్జి తో సామాన్య ప్రజలకు రాష్ట్రంలో విద్యుత్ అందించవచ్చు కానీ అటువంటి ప్రయత్నం చేయకుండా కేవలం సొంత ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను మంట కలుపుతూ అదాని కి సేవ చేయడం రాష్ట్రానికి రావణ కష్టంగా మారుతుందని ఈ సందర్భంగా ప్రభుత్వానికి హెచ్చరించడం జరిగింది. అధికారంలో రాకముందు తన అధికార దాహం కోసం ఓట్లు రాబెట్టుకోవడానికి విద్యుత్ ఛార్జీలు పెంచబోమని గొంతు చించుకొని హామీలు ఇచ్చిన కూటమి రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి ఆగమే గల మీద విద్యుత్ ప్రవేటికరణ లో భాగంగా స్మార్ట్ మీటర్లు పేర్లతో పేదల సొమ్ము దోచుకుంటుంది. పెంచిన విద్యుత్ చార్జీలు ట్రూ అప్ చార్జీలు ఇతర చార్జీలన్నీ రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు జి. బుజ్జిబాబు పి .బాలదేవ్ టి. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ముంచంగిపుట్టు నూతన కమిటీ ఎన్నిక

- మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులుగా వంతాల పూరిస్తాన్, పవన్.
- ఉపాధ్యక్షునిగా హథిరాం, సహ కార్యదర్శిగా రాజులమ్మ ఎన్నిక.






ముంచంగిపుట్టు, పెన్ పవర్, డిసెంబర్ 13.అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండల ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నూతన మండల కమిటీలో 16 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షునిగా వంతాల పురిస్తాన్, ఉపాధ్యక్షునిగా హథిరాం, కార్యదర్శిగా పవన్, సహకార్యదర్శిగా రాజులమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ శ్రీను, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు కొర్ర త్రీనాథ్, రాందాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నూతన కమిటీని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులుగా చేరడం గొప్ప విషయమని, సమాజం కోసం, విద్యార్థుల సమస్యల మీద మండల స్థాయిలో పరిష్కారానికి కృషి చేయుటకు పనిచేయాల్సిన అవసరత ఎంతైనా ఉందన్నారు. విద్యార్థుల కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని, వారి హక్కుల సాధనకు కృషి చేయాలని, నూతన మండల కమిటీని స్వాగతిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నియంత్రణకు కమిటీ సభ్యులు బాధ్యతగా పనిచేయాలి.




- చింతపల్లి ఎం.పీ.డీ.వో .యు. ఎస్ .వి. శ్రీనివాసరావు.



చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 13:–గ్రామాల్లో బాల్యవివాహాల నియంత్రణకు కమిటీ సభ్యులు బాధ్యతగా పనిచేయాలని స్థానిక ఎంపీడీవో యు ఎస్ వి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి చైల్డ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూబాల్యవివాహాల వల్ల కలిగే అనర్ధాలను నష్టాలను మండల గ్రామస్థాయి కమిటీ సభ్యులు ప్రజల్లోకి తీసుకొని వెళ్లి అవగాహన కల్పించాలని అన్నారు. బాల్య వివాహాల వల్ల బాలిక ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలగడమే కాకుండా మాత శిశు మరణాలు కూడా సంభవించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. వివాహ వయస్సు నిండిన యువతీ యువకులు కు మాత్రమే పెళ్లి చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు ఏర్పాటు చేస్తుంటే అంగన్వాడీ కార్యకర్తలు ఏఎన్ఎం ఆశ మరియు మహిళా పోలీసు ద్వారా సమాచారం తెలుసుకునే విధంగా సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. బాల్య వివాహాలు జరుగుతుంటే ముందుగా తెలుసుకొని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేయాలని ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సి.డి.పి.ఓ జీ.వి. రమణి, ఏ టి దబ్బ్యా ఓ జయ నాగలక్ష్మి, ఏ సి డి పి ఓ రామలక్ష్మి, చిట్టి బాబు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# నేడు చెముడులంక కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర



ఆలమూరు,పెన్ పవర్, డిసెంబర్ 13:ఆలమూరు మండలం చెముడులంక గ్రామ దేవత కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరగనుంది. నాలుగు లైన్ల జాతీయ రహదారిని ఆనుకుని ప్రధాన కాలువ చెంతన కొలువుదీరి ఉన్న ఈ అమ్మవారి జాతర మహోత్సవం ప్రతిఏటా అత్యంత వైభవంగా జరుగుతుంది.గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్పులతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సాగే ఈ జాతర మహోత్సవం తిలకించడానికి లంక గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివస్తారు. ఆలయ పరిసరాలను విద్యుత్ అలంకరణలతో తీర్చిదిద్దారు. అలాగే జాతీయ రహదారిపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఆలయ కమిటీ ద్వారా స్థానిక ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం అమ్మవారి తీర్థ మహోత్సవం కూడా వైభవంగా జరగనుంది.

# జర్నలిస్టులపై దాడులు బాధాకరం




తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 13:జర్నలిస్టులపై దాడులు జరగడం బాధాకరమని పలువురు పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాదులో టీవీ9 జర్నలిస్టు శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, తాజాగా సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిపై వేములలో దాడులకు వ్యతిరేకంగా ప్రెస్ క్లబ్, ఏపీయూడబ్ల్యూజే సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తాడేపల్లిగూడెం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ టీవీ9 రిపోర్టర్ పై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబు పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కడప జిల్లా వేములలో సాక్షి రిపోర్టర్ పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం 2430 జీవో తీసుకొచ్చి జర్నలిస్టులకు ఉరితాడు బిగించిందన్నారు. అదే మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఆ జీవోను సీఎం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జర్న లిస్టులపై ఉద్దేశపూర్వకంగా దాడి చేసిన వారిని కాపాడే విధంగా ప్రభుత్వాలు వ్యవహరించడం సరికాద న్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టే విధంగా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా దశల వారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేస్తున్న పాత్రికేయులపై దాడులు చేయడం ఇటీవల కాలంలో పెరిగిపోయింద న్నారు. అవసరమైన సమయంలో పాత్రికేయుల సేవలను వాడుకుంటూ లేదంటే దాడులు చేయడం సహేతుకం కాదన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన నిందితులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, రక్షణ కు చట్టం తీసుకురావాలన్నారు. పాత్రికేయుల పక్షపాతి నని చెప్పుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ విషయంలో సీఎం చంద్రబాబుకు మార్గ నిర్దేశం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి గజపతి ప్రసాద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తమ్మిశెట్టి రంగ సురేష్, సెక్రటరీ గొలిమే బుజ్జిబాబు, కోశాధికారి శీలి రాజు, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు యడ్లపల్లి మురళి, చిక్కాల రామకృష్ణ, ప్రింట్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు సుందరనీడి లక్ష్మయ్య, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా వైస్ ప్రెసిడెంట్ గారపాటి ప్రసాద్, అడపా సూర్య ప్రకాష్, వానపల్లి పుండరీకాక్షుడు, దేవా శివ ప్రసాద్, శీలి మహేష్, షేక్ ఖాదర్, కొడమంచిలి ఆశీర్వాదం, కృష్ణా రావు, బూర్గుల భాను, చిట్రోజు కృష్ణ, ఎం.కమల్, కొప్పిశెట్టి ప్రసాద్, అడ్డగర్ల చిన్నా, ఆదినారాయణ, వీర్రాజు, అయితం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం.



ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 13:శుక్రవారం హనుమద్వ్రతం సందర్భంగా ఆలమూరు, చింతలూరు, పెదపళ్ళ తదితర గ్రామాల్లోని ఆంజనేయ స్వామి వారి ఆలయాల్లో ప్రాత:కాల అభిషేకాలు, నాగవల్లీదళ అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలమూరులో బస్టాండ్ సెంటర్లో ఉన్న ఆంజనేయ స్వామి వారి ఆలయంలో శైవాగమ పండితులు కాళ్లకూరి సూరిపండు గారు స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. చింతలూరు శ్రీ భక్తాంజనేయ స్వామివారి ఆలయంలో వైఖానసాగమ పండితులు పెదపూడి వీర వెంకట సత్యనారాయణాచార్యులు గారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# నాటు సారా విక్రయిస్తున్న ఇరువురు అరెస్ట్



ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 13:ఆలమూరు ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో సర్కిల్ పరిధిలోని నాటు సారా అమ్మకాలు నిర్వహిస్తున్న ఇరువురిని అరెస్టు చేశారు.ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన ఉండ్రాజపు శాంతికుమారి, మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన యార్లగడ్డ వీరవేణి నాటు సారా అమ్మకాలు చేస్తుండగా వారు వద్ద నుంచి పది లీటర్లు నాటుసారా తో అదుపులోకి తీసుకున్నామని ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఐడి. నాగేశ్వరరావు తెలిపారు. అరెస్టు చేసిన ముద్దాయిలను ఆలమూరు మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా వారికి రిమాండ్ విధించారు. ఈ దాడుల్లో సిఐ.నాగేశ్వరావు తో పాటు ఆలమూరు ఎక్సైజ్ ఎస్సై రాంబాబు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన బిక్కవోలు విద్యార్థినిలను సత్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి...



అనపర్తి,పెన్ పవర్,డిసెంబర్ 13:జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిలు శిరీష, లావణ్య జ్యోతిలు జాతీయస్థాయిలో విజయకేతనం ఎగురవేసి అనపర్తి ప్రాంతానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలను తీసుకురావాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విద్యార్థులను ఆశీర్వదించారు. బిక్కవోలులో జరిగిన ఒక కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి జాతీయ స్థాయి మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బిక్కవోలు గ్రామానికి చెందిన విద్యార్థులు పారుపల్లి శిరీషా, రెడ్డి లావణ్య జ్యోతి లు ఎంపికైన సందర్భంగా వారిని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సత్కరించి, అభినందించారు.

# చేసిన అవమానంపై వివరణ ఇవ్వండి..

- పజ్ఞావంతుడు శకునిమామని సత్కరించుకుంటాం ...
- ఎమ్మెల్యే నల్లమిల్లి....



**అనపర్తి,పెన్ పవర్,డిసెంబర్ 13:**గతవారం అనపర్తి వైయస్సార్ సిపి కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైసిపి నాయకులు అంబేద్కర్ ని అవమానించే రీతిలో ప్రవర్తించడం గురించి నేను కొన్ని విమర్శలు చేయడం జరిగిందని దానికి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి విమర్శన సారాంశాన్ని ఎత్తుకోకుండా అనవసర ప్రస్తావనలు తీసుకొస్తూ మాట్లాడటం బాధాకరమని రామకృష్ణారెడ్డి అన్నారు. అంబేద్కర్ కు అవమానం జరిగిందంటూ ఎమ్మెల్యే విమర్శించడం దానికి కాదని సూర్యనారాయణ రెడ్డి కౌంటర్ ఇవ్వడం జరిగిన ప్రక్రియలో భాగంగా శుక్రవారం రామకృష్ణారెడ్డి తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ మీకు ఇంత అద్భుతమైన భాషాపరిజ్ఞానం అందిస్తున్న శకునిమామని మేము కూడా గౌరవించుకోవాలి. వారి చేతిరాత అద్భుతం కాబట్టి వారి చేతిని పూజించుకోవాలి. అల్లసారి పెద్దన్న కవికి గండపెండేరం తొడిగినట్లు శకునిమామకి మేం కూడా గండపెండేరం తొడిగే ఆలోచనలో ఉన్నాం. మాకు సమయం ఇప్పిస్తే శకునిమామ ను తగురీతిన సత్కరించుకుని వారి ద్వారా మీ అంత కాకపోయినా ఎంతో కొంత విషయ పరిజ్ఞానాన్ని వారి నుండి నేర్చుకునేటందుకు సిద్దంగా ఉన్నామన్నారు.

నేను మాట్లాడింది. జగన్మోహనరెడ్డి, సూర్యనారాయణరెడ్డి పోటోల మధ్య అంబేద్కర్ పోటో పెట్టి ఆ చిత్రపటంపైన రాజన్న రాజ్యం అని పెట్టి, క్రింద వైయస్సార్ సిపి అని పెట్టడం అనేది అంబేద్కర్ ని అవమానించడమే అని నేను మాట్లాడిన సారాంశం. నేను మాట్లాడిన కంటెంట్ ని వదిలిపెట్టి విషయాన్ని ప్రక్కదారి పట్టేలా మీరు మాట్లాడటం దుర్మార్గం. మీరు వర్ధంతి కార్యక్రమాన్ని ఏ విధంగా చేసారో ఒక వీడియో రిలీజ్ చేసారు. నవరత్నాల చిత్రపటం మధ్యలో అంబేద్కర్ గారి చిత్రపటం పెట్టి మీరు వర్ధంతి కార్యక్రమం చేసినట్లు స్పష్టంగా చెపుతున్నారు. ఆ విధంగా చేయడం నూటికి నూరుశాతం అంబేద్కర్ గారిని అవమానించడమే అన్నారు. నవరత్నాల చిత్రపటంలో అంబేద్కర్ గారి పోటో పెట్టి ఏవిధంగా కార్యక్రమం చేస్తారు? అంటూ ప్రశ్నించారు.

దానికి సమాధానం చెప్పకుండా నేను అంబేద్కర్ పేరు సరిగా పలకలేదంటూ విషయాన్ని ప్రక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

మొదట మీరు మీ కార్యాలయంలో అంబేద్కర్ కి చేసింది అవమానమా? కాదా? అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆడ లేక మద్దెలు ఓడు అన్నచందంగా నేను అంబేద్కర్ పేరు సరిగా పలకలేదని అని మీరు అభి యోగం చేస్తున్నారు.

అన్ని విషయాలు బాగా తెలిసిన సకళ కళావల్లభుడి నుండి కొంత విషయ పరిజ్ఞానాన్ని నేర్చుకుంటాం. అదే విధంగా గోపాలకృష్ణుడి దగ్గర నుండి వీరందరినీ సత్కరించుకోవలసిన భాధ్యత మాపై ఉంది. ముందుగా శకునిమామ చేత సమయం ఇప్పిస్తే వారి నుండి మొదలుపెడతాం. ఇక అనపర్తి సర్పంచ్ ని చీకటిగదిలో బంధించారంటూ మీరు మాట్లాడారు. ఒక్కసారి నియోజకవర్గంలో ఉన్న వైయస్సార్ సిపి ప్రజాప్రతినిధులు గత మూడున్నరేళ్ళుగా ఎలా ఉన్నారు ఈ ఆరు నెలల నుండి వారేవిధంగా గౌరవించబడుతున్నారో అనే విషయంపై చర్చకు సిద్దమా?.

మీరు మీ శ్రీమతి గారు తప్ప మిగిలిన ఏ ప్రజా ప్రతినిధులెవ్వరికీ గౌరవం అవసరం లేదనే పరిస్దితిలో చూసారు. శకునిమామ, మదనగోపాలుడు ఇద్దరూ మూడేళ్ళుగా అనపర్తి పంచాయితీలో ముఖ్యమైన సీట్లలో కూర్చుని సర్పంచ్ ని ఎక్కడో కూర్చోబెట్టి శకునిమామ ఆదేశించినట్లుగా సర్పంచ్ నడుచుకునేలా చేసిన మాట వాస్తవం కాదా అంటూ ప్రశ్నించారు. ఆర్చిలలో అనపర్తి సర్పంచ్ పేరు ఎందుకు వేయలేకపోయారు?. ఎందుకు వారికి గౌరవం ఇవ్వలేకపోయారు అంటూ నిలదీశారు. అంబేద్కర్ కి ఎందుకు అవమానం జరిగిందో వివరణ అడిగితే అది వదిలేసి విషయాన్ని ప్రక్కదారి పట్టించడం కోసం నా భాషా పరిజ్ఞానం మీద మీరు మాట్లాడుతుంటే మీరు సుత్తి సూర్యనారాయణరెడ్డో... నత్తి సూర్యనారాయణరెడ్డో అందరికీ అర్దమైందన్నారు.

అంబేద్కర్ గారి ఆలోచనా విధానం గానీ, ఆయన రాజ్యాంగాన్ని రచించిన విధానాన్ని గానీ ఆయన జీవిత చరిత్ర గురించి గానీ నాతో చర్చించడానికి మీరు సిద్దమా అంటూ సూటిగా ప్రశ్నించారు.

చర్చ సందర్బంగా మీరు ఎవరి సలహా తీసుకున్నా పర్వాలేదు. గూగుల్ సహాయం తీసుకున్నా పర్వాలేదు. ఏవిధంగా మీరు అంబేద్కర్ గురించి చర్చకు వచ్చినా నేను సిద్దంగా ఉన్నానన్నారు.

## అన్నదాత కుఅండగా వైఎస్ఆర్సిపిపార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ.




**రాజమహేంద్రవరం పెన్ పవర్ డిసెంబర్ 13.**అన్నదాతకు అండగా వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి వారి ఆదేశాలు మేరకు రైతులపై దగాచేస్తున్న కూటమి సర్కార్ పై వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా పార్టీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టరేట్ దాకా నిరసన ర్యాలీ కార్యక్రమంలో మాజీ ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్పర్సన్ మరియు మాజీ రుడా చైర్పర్సన్ మరియు ఆచంట నియోజకవర్గ పరిశీలకులు,శ్రీమతి మేడపాటి షర్మిళ రెడ్డి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ , మాజీ హోం శాఖ మంత్రి తానేటివనిత,రాష్ట్ర యువజన అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజారాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ రామ్ మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు , పార్లమెంట్ కోఆర్డినే గూడూరి శ్రీనివాసరావు , జక్కంపూడి విజయలక్ష్మి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశ్ రావు మాజీ డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు తో కలిసి వినతి పత్రం అందజేశారు... ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మాజీ కార్పొరేటర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వివిధ విభాగాల చైర్మన్, డైరెక్టర్లు మరియు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు....

## లక్ష తమల పాకుల పూజ

- తమలపాకుల పై సింధూరంతో జై శ్రీరామ్ అనే నామాని రాసిన భక్తులు





**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 13:** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసియున్న హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయ సన్నిధి లో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో లక్ష తమలపాకులు పూజ శుక్ర వారంప్రధాన అర్చకులు రఘు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో తమలపాకులపై శ్రీరామ అంటూ జపిస్తూ సింధూరంతో రాయగా వాటిని అర్చక స్వాములు లక్ష పత్రి పూజలో ఉపయోగించారు. అనంతరం హనుమంతుని ఆకారంలో సహస్ర జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఫణి , శేషు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నెహ్రూను సత్కరించిన ప్రభుత్వ జూనియర్ కాలేజీ బృందం



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 13:** జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూను గోకవరం జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కేఎస్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాలేజీ ఆధ్యాపక బృందం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు కృతజ్ఞతలు తెలియజేసి శాలువాతో సత్కరించి వెంకటేశ్వర స్వామి వారి రజిత విగ్రహాన్ని జ్ఞాపికగా అందించారు. ప్రిన్సిపాల్ కేఎస్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ఆరంభంలో బుక్స్ పంపిణీ నిమిత్తం మా కాలేజీకి వచ్చిన ఎమ్మెల్యే ఇక్కడ రోడ్లు చూసి చలించిపోయారన్నారు. వెంటనే సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించి సిమెంట్ రోడ్లు వేయించారన్నారు. కాలేజీ లోపల మొత్తం సిమెంట్ రోడ్లు వేయించి కాలేజీ విద్యార్థుల ఉన్నతి కోసం ఎమ్మెల్యే కృషి చేశారన్నారు. అదేవిధంగా కాలేజీ కాంపౌండ్ వాల్, గ్రౌండ్ ఫిల్లింగ్ చేయించాలని కోరడం ఆయన వెంటనే స్పందించి కాంపౌండ్ వాల్ , గ్రౌండ్ ఫిల్లింగ్ రాబోయే రోజుల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ, సిద్ధా పవన్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపక బృందం టి.శ్రీనివాస్, పి.సంధ్య, పి.రేవతి లక్ష్మి, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కొండబాబును సత్కరించిన ఆర్యవైశ్య ప్రముఖులు



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 13:** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గా ఎన్నికయిన కొత్త కొండబాబును జగ్గంపేట ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ (యల్లమిల్లి సీఎం) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. యల్లమిల్లి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు మామిడిపాక గోపి, మామిడిపాక రాజారావు, తమ్మన శ్రీరామచంద్రమూర్తి, తమ్మన వీర్రాజు గుప్తా, తమ్మన సతీష్, మామిడిపాక వెంకటరత్నం తదితరులు కొండబాబుకు సాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలియజేశారు. కొండబాబు సేవలకు తగిన గుర్తింపు లభించిందని ప్రభుత్వం ఆయనకు ఇచ్చిన డైరెక్టర్ పదవితో ఆర్యవైశ్యులకు న్యాయం జరిగేలా ప్రభుత్వానికి ఆర్యవైశ్యులకు వారధిగా ఆయన పని చేయాలని వారు కోరారు. జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జగ్గంపేటలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం




**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 13**: జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ మాధురి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతీ పౌరుడు విద్యుత్ ను పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ ను పొదుపు చేస్తే దానిని ఉత్పత్తి చేసినట్లేనని, ఇంటిలో ఉపయోగించే వివిధ విద్యుత్ పరికరాలను ఏవిధంగా ఉపయోగిస్తే విద్యుత్ ను ఆదా చేయవచ్చో వివరించారు. అనంతరం విద్యార్థులకు నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ నందు విద్యార్థుల నమోదు ప్రక్రియను, దాని ఆవశ్యకతను కాకినాడజిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రేమ్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.వి.వి సత్యనారాయణ, భౌతికశాస్త్ర అధ్యాపకులు గోపాలకృష్ణ, వారణాసి మల్లికార్జున శర్మ, అకడెమిక్ కో ఆర్డినేటర్ విశ్వేశ్వర్, ఝాన్సీ దేవి మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## పేదలు, వృద్ధులకు వస్త్రదానం, అన్న సమారాధన



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 13:** జగంపేట మండలం మామిడాడ గ్రామంలో శ్రీ సదాశివానంద యోగ జ్ఞానాశ్రయం నందు బ్రహ్మర్షి సద్గురు పరమపిత వాల్మీకి శ్రీశ్రీశ్రీ స్వామి శివానంద పరమహంస వారి జన్మదినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల మణి ముఖ్యఅతిథిగా హాజరై పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం సిద్ధ విద్యార్థిని విద్యార్థులు, యావన్మంది భక్తులు అఖండ జపములో పాల్గొని తరించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. గత 24 సంవత్సరాలుగా ప్రతి ఏట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి.బాబురావు తెలిపారు. ఆశ్రమ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు బ్రహ్మశ్రీ పసడుగుల బాబురావు, కోన బాబురావు బొడ్డేటి సుమన్, మామిడాడ గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గ్రేస్ మందిర్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, డిసెంబర్ 13:**ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు బోధనలను అనుసరించినట్లయితే సమాజంలో శాంతి ,ప్రేమ, దయ గుణాలు కలిగి ఉంటారని గ్రేస్ మందిర్ వ్యవస్థాపకులు రేవా బి ,ఎజ్రా శాస్త్రి అన్నారు. గురువారం రాత్రి జీలుగుమిల్లి రైస్ మిల్ ఆవరణలో గ్రేస్ మందిర్ యూత్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి ఏసుక్రీస్తు జీవితం ఆదర్శమని దానిని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని తెలిపారు .అంతకుముందు గ్రేస్ మందిర్ యూత్ సభ్యులు క్రీస్తు గీతాలాపనాలు, ఆటపాటలతో విశేషంగా అద్భుతంగా ఆకట్టుకున్నాయి. విద్యుత్ కాంతులతో బాణాసంచాలతో క్రిస్మస్ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ వేడుకలకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర లకు చెందిన విశ్వాసుకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోలవరం ఎమ్మెల్యే చి రి బాలరాజు పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ ప్రసంగీకులు రెవరెండ్ డాక్టర్ డేవిడ్ బెన్ హోమ్ ఉపన్యాసం పలువురిని ఆకట్టుకుంది. ప్రతి సంవత్సరం ఏజెన్సీ ప్రాంతంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఇక్కడ జరిగినంత ఘనంగా ఎక్కడ చూడలేదని పలువురు విశ్వాసకులు చెప్పుకోవడం విశేషం.

## భక్తి, విశ్వాసంతో ఆరాధనలో పాల్గొంటే మనశ్శాంతి లభిస్తుంది- డాక్టర్ ఉమర్ అలీషా



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 13:** భక్తి, విశ్వాసం, లక్ష్యంతో ఆరాధనలో పాల్గొన్న వారి కష్టాలు, దుఃఖములు అధిగమించి, మనశ్శాంతి, ఆరోగ్యం, తృప్తి లభిస్తుందని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా స్వామి అనుగ్రహ భాషణ చేశారు. శుక్రవారం జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాదుకా పూజా మహోత్సవం స్థానిక కన్వీనర్ ఆకెటి సూరి పంతులు మాష్టారు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పీఠాధిపతి ఉమర్ అలీషా స్వామి వారికి పూలతో ఘన స్వాగతం పలికారు. పీఠాధిపతి ఉమర్ అలీషా స్వామి వారికి వేద పండితుల గోపాల శర్మ ఆధ్వర్యంలో పాదుకలు తొడిగి వేద మంత్రాలతో గులాబీ పూలతో పాద పూజ వైభవంగా నిర్వహించారు. వందలాది సభ్యులు పాద పూజ లో పాల్గొని మహాదానందం చెందారు. పీఠాధిపతి ఉమర్ అలీషా స్వామి మాట్లాడుతూ కాట్రావులపల్లి ఆశ్రమ నిర్మాణంలో సూరి పంతులు మాస్టారి కృషి అనిర్వచనీయం. ఎందరో పిల్లలకు చదువు నేర్పి, వారిలో ఆధ్యాత్మిక పునాదులు వేసి, వారు ఉన్నత స్థానానికి వచ్చేలా కృషి చేశారన్నారు. అనారోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా నేటి పాద పూజలో పాల్గొన్న సూరి పంతులు మాస్టారు, వేద పండితులు గోపాల శర్మను స్వామి శాలువాలు కప్పి సన్మానించారు. స్వామి వారు మాట్లాడుతూ భక్తి, విశ్వాసం, లక్ష్యం తో నిర్వహించే కార్యక్రమం మానసిక ప్రశాంతతను ప్రసాదిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ 3 మొక్కలు నాటి, భూగ్రహము ను రక్షించు కోవాలని కోరారు. భవిష్యత్తులో భయంకరమైన అనారోగ్యాలకు గురి కాకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరూ ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా 3 మొక్కలు నాటి, సామాజిక భాద్యత నిర్వర్తించమనీ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి పిట్టా సుగుణ రావు, మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబరు 13:** గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలోని శ్రీ కిరణ్ హైస్కూల్, జగ్గంపేటలోని అక్షర జూనియర్, డిగ్రీ కాలేజీలో శుక్రవారం జగ్గంపేట సీఐ వై.ఆర్.కె శ్రీనివాస్ సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగాయన్నారు. ఎవరైనా అపరిచిత నెంబర్ల నుంచి ఫోన్లు చేసి డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు అంతా అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను నివారించవచ్చున్నారు. అదేవిధంగా డిజిటల్ ఆరెస్టులు అనేవి లేవని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. అలాగే మహిళా రక్షక్, రోడ్డు ప్రమాదాల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం సైబర్ నేరాల నివారణపై వీడియోలు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు, జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు, కిరణ్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అక్షర కాలేజీ చైర్మన్ కరస్పాండెంట్ సతీష్ బాబు, ప్రిన్సిపాల్ నీలం చక్రధర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



**జీలుగుమిల్లి, పెన్ పవర్, డిసెంబర్ 13:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 16న పోలవరం ప్రాజెక్టు సందర్శనకు రానున్న సందర్భంగా భద్రత ఏర్పాట్లు పటిష్టంగా అమలు చేయాలని పోలవరం ఎమ్మెల్యే చి రి బాలరాజు అధికారులను ఆదేశించారు .శుక్రవారం పోలవరం ప్రాజెక్టు ను జనసేన నాయకులతో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు .స్పిల్ వే, కాపర్ డ్యాం , లీకేజ్ అన్ని ముఖ్యమంత్రి పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం ఫోటో ఎగ్జిబిషన్, భారీ కేడింగ్, త్రాగునీరు, టెంట్లో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు .హెలిపాడ్ ప్రాంతంలో మెడికల్ క్యాంపు ఉండాలని అన్నారు. ఈయనతోపాటు జనసేన పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, సంయుక్త కార్యదర్శి పాదం నాగకృష్ణ ,మండల అధ్యక్షులు గుణపర్తి చిన్ని, నాయకులు మెట్ట బుచ్చిరాజు, తెల్లగాంశెట్టి రాము, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దు

- గంగవరం ఎస్సై భూషణం



**గంగవరం ,పెన్ పవర్, డిసెంబర్ 13:**ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి నుంచి ప్రయాణికులను ఎక్కించవద్దని ప్రయాణికుల ను బాధ్యతగా గమ్యస్థానాలకు చేర్చాలని గంగవరం ఎస్సై డిభూషణం సూచించారు. శుక్రవారం గంగవరం హనుమాన్ ఆటో యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ డ్రైవర్లు తమ కుటుంబ సభ్యుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలన్నారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ఆర్థికంగా ముందుకు వెళ్లాలన్నారు. రానున్న పండుగ నేపథ్యంలో ప్రజలు ఎవరు జూదల జోలికి వెళ్లొద్దని పోలీసుల అనుమతి ఉంది అంటూ ప్రచారాలను నమ్మొద్దని ఆయన సూచించారు కుటుంబ సభ్యులతో పండగలను ఆనందంగా గడుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ ఆటో యూనియన్ అధ్యక్షులు ఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ వెంకట్రావు ఇంట వాణీల వేడుక



**తాళ్ళపూడి, పెన్ పవర్, డిసెంబర్ 13:**పెద్దేవం గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు కుమార్తె ముప్పిడి మంగ, గంగరాజు దంపతుల కుమార్తెలు రిషిక, ప్రవల్లిక వాణీల వేడుక చాగల్లు మండలం ఎస్ ముప్పవరంలో జరిగింది. ఈ వేడుకకు పెద్దేవం గ్రామం నుండి నాయకులు వెళ్లి చిన్నారులను ఆశీర్వదించారు. తోట రామకృష్ణ, యండపల్లి లక్ష్మణ్, చింతా వెంకట స్వామి, త్రిమూర్తులు, బాబ్జి, తదితరులు చిన్నారులను ఆశీర్వదించిన వారిలో ఉన్నారు. అదేవిధంగా బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

# ధ్వజస్తంభ ఊరేగింపు





**కూనవరం,పెన్ పవర్,డిసెంబర్ 13.**మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ ఆలయం నందు ఆదివారం నాడు ఉదయం 8:30 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహిస్తున్నామని ఆలయ పూజారి,గురుభవాని శేఖ వెంకట్రావు అన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం నాడు ట్రాక్టర్ పై ధ్వజ స్తంభాన్ని కూనవరం నుండి టేకులబోరు వరకు ఊరేగింపుతో మేళతాళాలతో తీసుకొని వచ్చారు.మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో కొబ్బరికాయలు కొట్టి,పసుపు,కుంకమ,పూలు బిందెలతో నీళ్లు తీసుకొని వచ్చి ధ్వజస్తంభం పై అభిషేకం చేశారు.ధ్వజస్తంభ ప్రతిష్ట సందర్భంగా పుట్టింటికి అక్క, చెల్లెమ్మలను తీసుకుని రావడంతో ఊరంతా సందడిగా మారింది.శని,ఆదివారం రెండు రోజులు హోమాలు వేద పండితులతో నిర్వహిస్తామని గురుభవాని అన్నారు.

## వేటమామిడి జంక్షన్లో వాహనాల తనిఖీ.



**అడ్డతీగల,పెన్ పవర్, డిసెంబర్13.** అడ్డతీగల మండలం వేటమామిడి జంక్షన్లో శుక్రవారం సాయంత్రం అడ్డతీగల ఎస్సై వినోద్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహించారు వై. రామవరం తదితర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించి, రహదారి భద్రత గురించి వాహనదారులకు అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో అడ్డతీగల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యశాలలో మహిళ సిబ్బంది పై దాడి చేసిన నిందితుడిని శిక్షించాలి

జగ్గవరం సి హెచ్ సి లో వైద్యులు,వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జిలతో నిరసన



**కూనవరం,పెన్ పవర్,డిసెంబర్ 13.**మండలంలోని కోతులగుట్ట నందు ఉన్న సి హెచ్ సి వైద్యశాల నందు విధులు నిర్వహిస్తున్న వైద్యులు,వైద్య సిబ్బంది మారేడుమిల్లి పీ హెచ్ సీ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని శుక్రవారం నాడు నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ మహేష్ బాబు,ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్ మారేడుమిల్లి మండల కేంద్రం లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో ఉన్న ఒక హెల్త్ అసిస్టెంట్ మహిళ పై దొర చింతల పాలెం పంచాయితీ,శ్రీపురం గ్రామానికి చెందిన పత్రి ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తీ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూన్నామని అన్నారు.24 గంటలు హాస్పిటల్స్ లో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడులు చేయడం చాలా బాధాకరమని అన్నారు.మారేడుమిల్లి హాస్పిటల్ లో విధుల్లో ఉన్న మహిళా సిబ్బందిపై దాడి చేసిన ప్రవీణ్ కుమార్ అనే నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని,నిందితుడిని కఠినం గా శిక్షించాలని,ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గత నెలలో ఎటపాక మండలం లక్ష్మిపురం పీ హెచ్ సీ లో కూడా సిబ్బందిపై దాడి జరిగిందని తెలిపారు.రాత్రి సమయంలో విధులు నిర్వహించే మహిళ సిబ్బంది భయపడుతున్నారని తెలిపారు.ఇలాంటి సంఘటన లు పునరావృతం కాకుండా ప్రతి హాస్పిటల్ కి సెక్యూరిటీ గార్డులు నియమించేలా చర్యలు తీసుకోవాలని,సిబ్బందికి రక్షణ కల్పించాలని,అవసరం ఉన్న చోట్ల పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమం లో కూనవరం సీ హెచ్ సీ డా పి శ్వేత, డా.సి తేజ,హెడ్ నర్స్ బి. బొజ్జి,వైద్య సిబ్బంది రమేష్, దిలీప్,తేజ,శ్రీనివాస్ రెడ్డి,దేవిప్రసన్న,రాజు, సర్వేశ్వరరావు,సుజాత, అనసూర్య,సుబ్బారావు, రామాదేవి,అఖిల్,బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతలకు అండగా వైసీపీ ధర్నా





**కాకినాడ,పెన్ పవర్ డిసెంబర్ 13 :** కూటమి ప్రభుత్వం అన్నదాతలను మోసం చేస్తుందని వైసీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం ముందుగా కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్ నుంచి వైసీపీ శ్రేణులతో జిల్లా కలెక్టరేట్ వరకు సాగింది. మాజీ సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు రైతులతో ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని రైతులకు ఇస్తానన్న డబ్బుని వెంటనే వారి ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జేసీకి వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ పి అనంత ఉదయభాస్కర్,వైసీపీ నాయకులు దాడిశెట్టి రాజా,నాగులాపల్లి ధనలక్ష్మి, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ముద్రగడ పద్మనాభ రెడ్డి, దవులూరి దొరబాబు, తోట రాంజీ, పోలసపల్లి సరోజ,సుంకర శివప్రసన్న, జమ్మలమడక నాగమణి, మాకినీడి శేషు కుమారి, అంగూరి లక్ష్మీ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

# యువ ఉత్సవ్ యువత ప్రతిభా ప్రకాశానికి చక్కని వేదిక





- జేసీ రాహుల్ మీనా
- ఉత్సాహంగా..ఉల్లాసంగా యువ ఉత్సవ్

**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 13 :**యువ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉండడంతోపాటు వారిలోని ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు,దేశభక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు.భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు,క్రీడల మంత్రిత్వశాఖ,కాకినాడ జిల్లా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం శుక్రవారం పైడా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, పటవలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ రాహుల్ మీనా హాజరై విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం సానుకూల దృక్పథంతో ఇటువంటి పోటీలలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ యువ ఉత్సవ్ కార్యక్రమం ద్వారా వచ్చిన అవకాశాన్ని యువతి,యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.రాష్ట్ర రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు మరింత పట్టుదలతో కృషి చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటాలని జేసీ ఈ సందర్భంగా సూచించారు. పైడా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ప్రకాష్ మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. యువ ఉత్సవంలో భాగంగా మెడికల్, డీఆర్డీఏ, అగ్నిమాపక ఇతర శాఖల స్టాళ్లను జేసీ రాహుల్ మీనా అధికారులతో కలిసి పరిశీలించారు.నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ యువ ఉత్సవ్ లో భాగంగా ఇండియా ఏ2047 నాటికీ దేశం ప్రపంచానికి దిక్సూచి లా ఉండాలన్నారు. అందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయన్నారు.
ప్రజలలో మన దేశం విభిన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం గురించి ప్రశంసలను సృష్టించడం వంటివి చేయవచ్చని ఆయన తెలిపారు. భారతదేశం ఇటీవల సంవత్సరాలలో వివిధ రంగాలలో సాధించిన ముఖ్యమైన పురోగతిని ప్రదర్శించడానికి యువ ఉత్సవాలు లాంటి కార్యక్రమాలు చక్కని వేదికలా ఉపయోగ పడతాయన్నారు.అలాగే యూత్ క్లబ్ సభ్యుల కోసం ఫోరమ్ వంటి ప్రతిభను చేర్చడానికి ఈ కార్యక్రమంలో భాగంగా చేయబడటం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు.కాకినాడ జిల్లా యువతీ యువకులు అత్యద్భుత ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ శ్రీమతి నిత్య, కాలేజీ ఇంక్యుబేషన్ డైరెక్టర్ వంశీ, జిల్లా నలుమూలల నుంచి యువత, యువతీ యువకులు పాల్గొన్నారు.

# పన్నుల వసూలులో నిర్లక్ష్యం వద్దు

- బకాయిదారులకు నోటీసులు ఇవ్వండి
- నగరపాలక సంస్థ కమిషనర్ భావన



**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 13 :**ఆర్థిక సంఘం నిధులు మంజూరు పొందుటకు మరియు నగర అభివృద్ధికి దోహదపడే
పన్నుల వసూలు విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దని, పన్ను బకాయిదారులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. ఆస్తి, నీటి పన్నుల బకాయిలు, నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్సులోని దుకాణాల అద్దె బకాయిల విషయమై కమిషనర్ భావన శుక్రవారం రెవెన్యూ అధికారులతో సమీక్షించారు.పన్ను వసూలు విషయము పై రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,వార్డు అడ్మిన్ కార్యదర్శులు కార్యాచరణ రూపొందించుకొని పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలు రూ.20 కోట్ల ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. బకాయిదారులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.అలాగే పన్నులు తక్కువ వస్తున్న వాటిని రివైజ్ చేయాలని సూచించారు. రూ.15 కోట్ల మేర ఉన్న నీటి పన్ను బకాయిలను కూడా వసూలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు,సిబ్బందిపై ఉందన్నారు.నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్సుల్లోని దుకాణాలకు అద్దె చెల్లించకుండా బకాయిపడ్డ వారికి నోటీసులు ఇవ్వడంతో పాటు,ఆ షాపులను సీజ్ చేయాలని ఆదేశించారు. పన్నుల వసూలులో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దని,ప్రతి వారం ఈ విషయంపై సమీక్షిస్తానని, పురోగతి కనిపించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె.టి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, రెవెన్యూ అధికారులు,శ్రీ కోట శిరీష్ కుమార్, నిర్మలా కుమారి,రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# సానా సతీష్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలి

డాక్టర్ చప్పిడి, నులుకుర్తి



**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 13 :**సానా సతీష్ బాబు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా.చప్పిడి వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు.రాజ్యసభకు నామినేషన్ వేసి జిల్లాకు విచ్చేసిన సానా సతీష్ బాబును కూటమి నాయకులు డా.చప్పిడి వెంక టేశ్వరరావు,నులుకుర్తి వెంకటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా సానా సతీష్ బాబును డా.చప్పిడి వెంక టేశ్వరరావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు సాలువాలు కప్పి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం డా.చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువ నాయకుడు సానా సతీష్ బాబు మరిన్ని అత్యున్నత పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు.

# భార్యపై అనుమానంతో వ్యక్తిపై దాడి





నింధితులు అరెస్ట్

**జగ్గంపేట(కిర్లంపూడి), పెన్ పవర్, డిసెంబరు 13:** భార్యపై అనుమానం రావడంతో అనుమానితుడిపై దాడి చేసిన సంఘటనపై శుక్రవారం కిర్లంపూడి పోలీసే స్టేషన్లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఎస్ఐ సతీష్ బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన సతీష్ తన భార్య మీద అనుమానం పెంచుకున్నాడు. ఆ గ్రామానికి చెందిన రమణపై అనుమానంతో అతన్ని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. సతీష్ అతని అన్నయ్య రాజు, బావమరిది శివతో కలిసి మోటారు బాగు చేయాలని రమణను బూరుగుపూడి అయ్యప్పస్వామి గుడి దాటిన తర్వాత పుంత రోడ్డులోకి తీసుకుని వెళ్లి దాడి చేశారు. ఈ దాడిలో రమణ తప్పించుకుని పారిపోయాడు. దీంతో రమణ మోటారుసైకిల్ ను ఆ ముగ్గురు కలిసి పెట్రోల్ పోసి తగలబెట్టేశారు. దీనిపై ఫిర్యాదు రావడంతో ఎస్ఐ సతీష్ సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి ముద్దాయిలను అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ కు తరలించారు. అయితే ఈ ఘటనలో నిందితుడైన సతీష్ భార్యను వేధిస్తున్న రమణను జగ్గంపేట సీఐ వై ఆర్ కె శ్రీనివాస్ ఆదేశాలతో ఎస్ఐ సతీష్ బాబు శుక్రవారం అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అతన్ని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా 15రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

# రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దీక్షితుల. లక్ష్మీ నరసింహం మృతి.



**అడ్డతీగల, పెన్ పవర్, డిసెంబర్ 13.** అడ్డతీగల జిల్లా పరిషత్ హై స్కూల్లో దశాబ్ద కాలం పైబడి గెజిటెడ్ హెడ్మాస్టర్ గా, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన గురువర్యులు దీక్షితుల. లక్ష్మీనరసింహం. శుక్రవారం ఉదయం కాకినాడ ఆయన స్వగృహంలో మరణించారన్న వార్త ఆయన వద్ద విద్యను అభ్యసించిన ఎందరో విద్యార్థినీ, విద్యార్థులు అయినటువంటి తన శిష్యులను కలవరపరిచింది. వివరాల్లోకెళ్తే అల్లూరి సీతారామరాజు జిల్లా, అడ్డతీగల మండలం అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి, ఎందరో విద్యార్థిని విద్యార్థులకు గురువర్యులుగా ఉండి 1991 వ, సంవత్సరంలో రిటైరై ఎంతోమంది విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రుల మనసులను కూడా దోచుకున్నటువంటి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసింహ%శీ% ఇక లేరు, అనే వార్తను ఈ ప్రాంతవాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. అంకిత భావంతో పనిచేసి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దినటువంటి మహోన్నతమైన వ్యక్తి అని ఆయన వద్ద విద్యను అభ్యసించిన విద్యార్థులు కొనియాడారు, ఆయన రిటైర్ అయిన అనంతరం కాకినాడలో తమ పిల్లల వద్ద ఉంటూ, శుక్రవారం ఉదయం ఆరు గంటలకు పరమపదించారు, అన్న విషయం ఆయన శిష్యులందరకు తెలియడంతో, శనివారం ఉదయం 10 గంటలకు కాకినాడలో జరగబోయే అంత్యక్రియల కార్యక్రమం నకు అనేకమంది ఆయా ప్రాంతాలలో ఉంటున్న ఆయన శిష్యులు చివరిసారిగా నివాళులు, అర్పించడానికి వెళుతున్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు దేవుని కోరుతున్నారు.

# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

బీచ్ పార్కును సందర్శించిన కమిషనర్



**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 13 :**బీచ్ పార్కులో జరుగుతోన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, కౌడా వైస్ చైర్‌పర్సన్ భావన ఐఏఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ సాగర తీరాన ఉన్న బీచ్ పార్కును కమిషనర్, కౌడా అధికారులతో కలిసి పరిశీలించారు. బీచ్ పార్కును సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రోడ్డు, డివైడర్ మధ్య గ్రీనరీ, ఆర్చ్ వంటి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 20వ తేదీన బీచ్ పార్కులో ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ పనులన్నీ పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట కౌడా సెక్రటరీ కాళీబాబు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఉన్నారు.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 13:** దోమల నివారణ కు సమిష్టిగా చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం ఎన్.టి.ఆర్.జంక్షన్ పరిధిలోని 9, 10,11,12 వార్డుల్లో శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే డ్రై డే అవగాహన కార్యక్రమాల అమలును సహాయ మలేరియా అధికారి పి.శ్రీనివాసరావు, సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణ రావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి టి.వి.ఎన్.లక్ష్మి, మేరీ, మంగతయారు, పోశమ్మ ఆశాలు అంగన్వాడీ సిబ్బంది వర్కర్ సుజాత ,అంగన్వాడీ కార్యకర్తలు శానిటేషన్ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై భారం : సిపిఎం

పోడూరులో నిరసన కార్యక్రమం

**పోడూరు పెన్ పవర్ డిసెంబర్-13:** రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి విద్యుత్ ట్రూ ఆఫ్ ప్రజలపై భారం మోపిందని సిపిఎం పోడూరు మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వర్లు అన్నారు. పోడూరు సొసైటి కూడలి లో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్తు చార్జీల పెంపునకు నిరసనగా కరెంట్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యుత్తు ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారన్నారు. నిత్యవసర సరకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు, చౌక డిపోల ద్వారా నిత్యవసరవ వస్తువుల సంఖ్య పెంచాలని కోరారు. ఉపాధి చూపాలని వ్యవసాయ కార్మికులు కోరుతున్నారన్నారు. వైరల్ జ్వరాలు బారిన పడిన వారికి వైద్య సౌకర్యాలు పెంచాలన్నారు .ఈ కార్యక్రమంలో నేతలు పిల్లి ప్రసాద్, బొంతు శ్రీను, జి సూర్యారావు, టి లక్ష్మణరావు,మీసాల గణపతి,ఎం శ్రీనివాసరావు,జి హనుమంతరావు, బండి రమేష్, మామిడిశెట్టి త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.



# సాగు నీటి వినియోగదారులు సంఘం ఎన్నికలు

**అల్లవరం,పెన్ పవర్,డిసెంబరు 13:**మండలంలోని శనివారం సాగు నీటి వినియోగదారులు సంఘం ఎన్నికలు జరుగుతాయని అల్లవరం మండల తహసీల్దార్ వి.వి.ఎల్.నరసింహారావు తెలిపారు. అల్లవరం మండలం పరిధిలో 5 (అయిదు) నీటి వినియోగ దారులు సంఘాలు, 60 (అరవై) ప్రాదేశిక నియోజక వర్గాలు ఉన్నాయన్నారు. మండలంలో 13,962 (పదమూడు వేల తొమ్మిది వందల అరవై రెండు) మంది తమ ఓటు హక్కుని వినియోగించవలసియుందని తహసీల్దార్ పేర్కొన్నారు. 1బి గాని, పాస్ బుక్ గాని, వీఆర్వో ధ్రువ పత్రం గాని తీసుకొని వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకొనవలెనని అన్నారు.

# తహసిల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు



**వై రామవరం,పెన్ పవర్, డిసెంబర్ 13:** మండలంలో గ్రామ రెవెన్యూ సదస్సులు తొలి రోజు తాసిల్దార్ పి. వేణుగోపాల ఆధ్వర్యంలో నిర్వహించారు.
లోయర్ పోర్టులో దాలిపాడు పంచాయతీలో బోనంగి పాలెం,ములగలపూడి, గుమ్మరపాలెం గ్రామాలలో నూ, అప్పర్ పార్ట్ లో డిప్యూటీ తహసిల్దార్ కే సుధాకర్ రావు ఆధ్వర్యంలో పాతకోట పంచాయతీ సెనగనూరు,పులిమెట్ల,సింగన కోట, తంగేడుకోట గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూమి సమస్యలపై రైతులకు వివరించడం జరిగిందని, సమస్యలను దరఖాస్తు రూపంలో స్వీకరించడం జరిగిందని తెలిపారు.

# అధికారులు ఫుల్... ప్రజా ప్రతినిధులు నిల్

- ఇది గూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తీరు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 13:** ముగ్గురు ఎంపీటీసీలు... ముగ్గురు సర్పంచులు... హాజరులో ఏడుగురు ఎంపీటీసీలు.... కోరం కావడంతో రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. గూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో విశ్వనాథ్ గత వారం రోజులు క్రితమే ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు మండలంలోని సర్పంచులకు ఎంపీటీసీలకు అజెండా పంపారు. సమాచారం కూడా చేరవేశారు. అయినా మండలంలో ఉన్న సర్పంచులు ఎంపీటీసీలు కనీసం సమావేశానికి రాకుండా గైర్హాజరయ్యారు. సమావేశ ప్రారంభ సమయానికి ముగ్గురు ఎంపీటీసీలు, ముగ్గురు సర్పంచులు మాత్రమే సమావేశంలో ఉన్నారు. ఉదయం 10 గంటలకు జరగాల్సిన సమావేశం 12 గంటలైనా ప్రారంభం కాకపోవడంతో సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఒకపక్క మండలంలో రెవెన్యూ సదస్సులు జరుగుచుండగా మరోపక్క మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు తమకున్న సమయాన్ని ఎక్కువమంది మండల పరిషత్ సమావేశానికి హాజరయ్యారు. కానీ వారు గత రెండు నెలల పైబడి మండలంలో ప్రభుత్వం నిర్వహించిన సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులను విశ్లేషిస్తుండగా వాటిని వినడానికి గాని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తెలుసుకోవడానికి ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేకపోవడం విడ్డూరకరం. అయినా సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ శేషులత సమావేశాన్ని ప్రారంభించారు. అధికారులకు అధికారులే వారు చేస్తున్న పనులను సమావేశంలో చెప్పుకుని అయిందనిపించారు. శుక్రవారం సమావేశం ఉందని గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు సర్పంచులకు ఎంపీటీసీలకు మండల పరిషత్ అధికారులు ఫోన్ల ద్వారా సమాచారం అందించిన ఏ ఒక్కరూ రాకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సమావేశానికి ఎమ్మెల్యే ఎమ్మెల్సీ జడ్పీ చైర్మన్ తదితర ఉన్నత ప్రజాప్రతినిధులు వస్తున్నారంటేనే మండలంలో ఉన్న ప్రజా ప్రతినిధులు వస్తున్నారు. కానీ మిగిలిన సమావేశాలకు అరకొరగా వచ్చి సంతకాలు పెట్టి వెళ్ళిపోతున్నారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని గ్రామాభివృద్ధికి తోడ్పడుతామని తమను గెలిపిస్తే గ్రామాలను సుందరవణంగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చి గెలిచిన సర్పంచులు ఎంపీటీసీలు కనీసం మండల పరిషత్ సమావేశానికి హాజరు కాకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అయితే మండల పరిషత్ అధికారులు మాత్రం కొంతమంది ఎంపీటీసీలు సర్పంచులు వచ్చి హాజరు పట్టిలో సంతకాలు చేసి తమకు వ్యక్తిగత పనులు ఉన్నాయని చెప్పి వెళ్లారని చెబుతున్నారు. సమావేశానికి హాజరు కాకుండా సంతకాలు పెట్టి వెళ్లిపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎంపీపీ శేషులత కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి హాజరు కావలసిన ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, జిల్లా పరిషత్ చైర్మన్ గంట పద్మశ్రీ తదితరులు ఎంపీటీసీలు సర్పంచులు హాజరు కాలేకపోవడంతో వారు తమ పర్యటనను రద్దు చేసుకున్నారు. మండల పరిషత్ అధికారులు రానున్న సమావేశాలకైన పూర్తిస్థాయిలో ఎంపీటీసీలు సర్పంచులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీపీ శేషులత ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు వేచి చూద్దాం.

## ఈనెల 16న ఆయుష్మాన్ భవ హెల్ప్ లైన్ కన్వీనర్ రాక

**పెనుమంట్ర,పెన్ పవర్,డిసెంబర్-13:** ఈనెల 16వ తేదీన ప్రధానమంత్రి ఆయుష్మాన్ భవ హెల్ప్ లైన్ కన్వీనర్ పుష్పాంజలి (ఏలూరు) నుండి వచ్చి ఆయుష్మాన్ భవ కార్డు ప్రింట్ చేయించి ఇచ్చేందుకు వస్తున్నారని పెనుమంట్ర మండల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పడాల జగన్నాథ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. ఈమె అదే రోజు .ఉదయం 10 గంటల నుండి మార్టేరు రోటరీ క్లబ్ నందు అందుబాటులో ఉంటారని తెలిపారు. 70 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు దీనికి ఈ కార్డు పొందుటకు అర్హులని తెలిపారు. ఈ కార్డు తయారు చేయించి ఇచ్చేందుకు రూ. 200/-,చెల్లించాలి అన్నారు. ఈ కార్డు కావలసినవారు వారి యొక్క ఆధార కార్డు ్న నకలతో , సెల్ ఫోన్ తో రోటరీ క్లబ్ కి రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు :94907 99222, 94922 40529, 99890 14233 అను నెంబర్లను సంప్రదించాలని జగన్నాథ్ రెడ్డి సూచించారు.

## విద్యుత్ బారాలు వద్దు....




**పెనుమంట్ర ( ఆచంట), పెన్ పవర్, డిసెంబర్ 13:** పెరిగిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాల్ అన్నారు. ప్రజలపై మోపుతున్న విద్యుత్ బారాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారంఆందోళన చేపట్టారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగింపు ఆపాలని, అదాని విద్యుత్ ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లును దహనం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గోపాలన్ మాట్లాడుతూ ప్రజా నిరసనను పట్టించుకోకుండా రాష్ట్రంలోని కూటమీ ప్రభుత్వం ముందుకెళ్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ బారాల భారం ప్రజలపై వెయ్యిబోమని చెప్పి నేడు విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయం అన్నారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజలపై విపరీతమైన భారాలు వేయడం కారణంగానే ఆ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దదించారని, టిడిపి కూటమీ ప్రభుత్వం పునరాలోచించి విద్యుత్ బారాలను రద్దు చేయకపోతే ప్రజల ఉద్యమిస్తారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం రు 16,000 కోట్ల భారం మోపిందని, విద్యుత్ బిల్లులు చెల్లించకుండా ప్రజలు తిరగబడాలని ఆయన పిలుపునిచ్చారు. అదానికి ఆదాయం సమకూర్చేలా స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, దీన్ని ప్రజలు తిప్పి కొట్టాలని కోరారు. అదాని కంపెనీ తయారు చేసిన స్మార్ట్ మీటర్లను రూ 30 వేల చొప్పున కొనుగోలు చేశారని ఈ భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపి 10 సంవత్సరాల లో వసూలు చేస్తారని తెలిపారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని ఎన్నికల ముందు చెప్పిన టిడిపి ఇప్పుడు ఆ మీటర్లు ఏర్పాటుకు పూనుకోవడం దారుణం అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి మోహన్ రావు, నేతలు కుసుమే జయరాజు, , తలుపూరి బుల్లబ్బాయి, బండి రంగారావు, చదలవాడ చంటిబాబు, తోటపల్లి సత్యనారాయణ, ఎస్ వి యన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## జుత్తిగ శివాలయాన్ని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ సతీమణి రమాదేవి



**పెనుమంట్ర,పెన్ పవర్,డిసెంబర్-13:** మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జుత్తిగ శివాలయాన్ని ఉండి ఎమ్మెల్యే, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు సతీమణి రమాదేవి శుక్రవారం దర్శనం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జుత్తిక శివాలయాన్ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ శివుడు ఎంతో మహిమాన్వితుడని కొనియాడారు. జుత్తిగ టిడిపి నాయకులు వీరవల్లిసత్యనారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పులగం అమ్మిరెడ్డి, వీరవల్లి రాంబాబు, జుత్తిగ జనసేన నాయకులు వీరవల్లి ఇంద్రయ్య, బిజెపి నాయకులు తమనంపూడి బ్రహ్మానందరెడ్డి, సాయి రెడ్డి, మల్లిపూడి టిడిపి నాయకులు గుడిమెట్ల సుందరం రామిరెడ్డి, గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, కడలి సూర్యరావు, జి శ్రీనివాస్ కె కుమార్ పాల్గొన్నారు.

## మరిడమ్మ సన్నిధిలో వైభవంగా స్వర్ణ పుష్పార్చన



**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 13 :** పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న మరిడమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి స్వర్ణ, రజత పుష్పాలతో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున నిత్య కైంకార్యాలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గర్భగుడి నుంచి ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. మండపంలోని ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్టింపచేసి వేదపండితుల పవిత్ర మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళుతున్న మండల ప్రత్యేక అధికారికి ఘనంగా వీడ్కోలు



**గంగవరం, పెన్ పవర్, డిసెంబర్ 13:** మండల ప్రత్యేక అధికారి, రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి జివిఎల్ఎన్ రాఘవన్ బదిలీపై విజయవాడ వెళుతున్న నేపథ్యంలో శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మండలానికి చేసిన సేవలను ఎంపీడీవో గుర్తు చేశారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు సలహాలు ఇస్తూ ముందుకు నడిపించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయనను దుస్సాలువా తో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి టి మల్లేశ్వరరావు, ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షణ అధికారి సిద్దేశ్వర రావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎం ప్రకాష్, మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీలలితా ఇండస్ట్రీస్ లో ఐటీ దాడులు




- ఏకకాలంలో పలు బృందాలుగా తనిఖీలు
- ఉదయం నుంచి కొనసాగుతున్న సోదాలు

**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 13 :** పెద్దాపురం పట్టణంలో ఐటీ దాడులు కలకలం రేపాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్రాలతో మిల్లింగ్ చేసిన బియ్యాన్ని నౌకల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసే ప్రముఖ రైస్ బ్రాండ్ సంస్థ అయిన శ్రీలలితా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన పలుచోట్ల ఆదాయపు పన్ను శాఖ (ఇన్ కమ్ టాక్స్) అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఆ సంస్థకు చెందిన మేనేజింగ్ డైరెక్టర్లు మట్టే సత్య ప్రసాద్, మట్టే శ్రీనివాస్ ల నివాసాలతో పాటు వారి సన్నిహితులు, బంధువులు, ఉద్యోగులు, సిబ్బంది ఇళ్ళల్లో అధికారులు ఏకకాలంలో బృందాలుగా విడిపోయి సోదాలు ప్రారంభించారు. తెల్లవారుజాము నుంచి సంస్థకు సంబంధించిన రికార్డులు, ఆదాయ వ్యయాలకు చెందిన పలు కీలక పత్రాలతో పాటు కంప్యూటర్లు, డాక్యుమెంట్లు, నగదు, బంగారు ఆభరణాలకు సంబంధించిన పలు వివరాలు సేకరించినట్లు తెలిసింది. దాడులు చేయడానికి కొద్ది రోజుల ముందు నుంచే ఐటి అధికారులు పట్టణంలో పలువురు పారిశ్రామికవేత్తలపై నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. ఐటీ అధికారుల బృందం స్థానికంగా ఓ హెటల్లో మకాం వేసి లక్షిత వ్యక్తుల సమస్త సమాచారాన్ని, వారి కదలికలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. ఏకకాలంలో ఐటీ అధికారులు ఫ్యాక్టరీ, ఇళ్లలోకి ప్రవేశించి అక్కడ ఉన్న వారి వద్ద నుంచి సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం, బయటకు పంపకపోవడం, అలాగే ఇండస్ట్రీలో ఉన్న సిబ్బంది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు సిబ్బందిని ఎవరినీ లోపలకు అనుమతించలేదు. డాట్ టు డాట్ కనెక్షన్ విధానాన్ని అనుసరిస్తూ స్ట్రైక్ టైం కంటే కొంత సమయం ముందే ఐటీ అధికారులు సీఆర్పీఎఫ్ బలగాలతో సమీప ప్రాంతాలకు చేరుకుని దాడులు ఆరంభించారు. స్థానికంగా ఉన్న పోలీస్ అధికారులు సహకారం ఏమాత్రం తీసుకోకుండా అధికారులు తమ తనిఖీలు చేపట్టారు. ఈసోదాలు సుమారు మూడు రోజులపాటు జరగనున్నట్లు తెలిసింది.

## గ్రామ స్థాయిలో భూ వివాదాల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు: తహసిల్దార్ సయ్యద్






పెనుమదంలో రెవెన్యూ సదస్సు

**పోడూరు , పెన్ పవర్, డిసెంబర్ 13:** గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి వేదికలుగా రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కోడూరు తహసిల్దార్ సయ్యద్ మౌలాన ఫాజిల్ సూచించారు. పోడూరు మండలం పెరుమదంలో శుక్రవారం తహసీల్దార్ సయ్యద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో భూ వివాదాలను తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ఎలాంటి రుసుము ఉండదని తెలిపారు. సమస్యల పరిష్కార మార్గం కోసం మండల కేంద్రంలో అందుబాటులో ఉంటామని, ఎప్పుడైనా వచ్చి మీ అర్జీ ఇవ్వవచ్చు అని పేర్కొన్నారు. 24 అర్జీలు అందాయ అన్నారు. భూ వివాదాలు కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వివిధ అర్జీల పరిష్కారాన్ని రోజువారీగా పరిశీలన చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కార చర్యలు తీసుకున్నట్లు బాధితులకు తెలుగులోనే రసీదు, తిరుగు సమాధానం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తానేటి బాబురావు, ఎంపీటీసీ సభ్యులు, టిడిపి గ్రామ అధ్యక్షుడు కడలి ఆంజనేయులు, టిడిపి నర్సాపురం పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి రాచకొండ విశ్వనాథం, దేవరపు దొరబాబు, తంగేడు సత్యనారాయణ, బోసుపాముల నాగరాజు, ఆరే కందుల రాంబాబు, విఆర్ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కనకమహాలక్ష్మి వార్షికోత్సవం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 13:** కనకమహాలక్ష్మి 32వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుంకుమ పూజలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం బిజెపి కన్వీనర్ ఈతకోట భీమా శంకరరావు, పెంటపాడు ఆర్వో నరిశే సోమేశ్వరరావు, కో కన్వీనర్ రామగాని సత్యనారాయణ, బిజెపి నాయకులు అయినం బాలకృష్ణ, ఎస్వీ రంగారావు, కంచర్ల రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ జనవరి 5వ తేదీన జరిగే హైందవ శంఖారావం గురించి వివరించారు. నరిశే సోమేశ్వరరావు ఆలయ అభివృద్ధికి 25వేల రూపాయలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

# రాజధాని అమరావతే చిక్కుముడులకు పరిష్కారం...



**విజయవాడ, డిసెంబర్ 13, పెన్ పవర్::** ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణంలో సాంకేతికంగా ఉన్న చిక్కుముడులను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోంది. అమరావతి చుట్టూ అల్లుకున్న వివాదాలను పరిష్కరించేలా చర్యలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతి మాత్రమే ఉంటుందని సుప్రీం కోర్టులో అఫిడవిట్ సమర్పించింది.అమరావతి నిర్మాణం చుట్టూ వైసీపీ ప్రభుత్వం సృష్టించిన న్యాయపరమైన వివాదాలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమరావతి మాత్రమే ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా పరిగణించడంతో పాటు రాష్ట్ర రాజధాని అమరావతిని కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సుప్రీం కోర్టుకు వివరించింది. మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా ఏపీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ జగన్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే గత ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలైంది. దీంతో వివాదాన్ని ముగించాలని ఎన్డీఏ భావిస్తోంది.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవిష్యత్తులో అమరావతికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పక్కాగా రాజధానిని ఖరారు చేసేలా అడుగులు వేస్తున్నారు. సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న వివాదాన్ని పరిష్కరించిన తర్వాత రాజధానిని సాధికారికంగా ప్రకటించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.రాజధాని మాస్టర్ ప్లాన్ అమలు చేయడంతో పాటు భూసమీకరణలో నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు చట్టపరంగా నెరవేర్చాల్సిన హామీ ప్రకారం అమరావతిని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో గత ప్రభుత్వ దాఖలు చేసిన పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.రాజధాని నిర్మాణంతో పాటు రాజధాని ప్రాంత అభివృద్ధి. భూములుచ్చిన రైతులకు భాగంగా అభివృద్ధి చేసిన ప్లాట్లను అన్ని రకాల మౌలిక వసతులతో మూడేళ్లలో పూర్తి చేస్తామని సుప్రీం కోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీ రాజధాని విషయంలో వైసీపీ ప్రభుత్వ నిర్ణయంపై ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుతోపాటు, సుప్రీంకోర్టు జారీ చేసే ఆదేశాలకు కట్టుబడి ఉంటామని పేర్కొంది. రాజధాని విషయంలో నెలకొన్న సందిగ్ధతకు ముగింపు పలికేలా, ఇప్పటికే జరిగిన జాప్యం, నష్టాన్ని, రైతులు, రాష్ట్ర ప్రజల న్యాయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం కోర్టు ముందున్న స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణ ముగించాలని కోరింది.అమరావతి రాజధాని అంశానికి సంబంధించిన కేసుల విచారణ గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం 16 పేజీల అఫిడవిట్ దాఖలు చేసింది.సచివాలయం కోసం శాశ్వత భవనాలు సిద్ధమైన తరువాత ప్రస్తుతం ఉన్న భవనాలను ఇతర అవసరాల కోసం వినియోగిస్తామని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. హైకోర్టు న్యాయ మూర్తులు, మంత్రులు, అఖిలభారత సర్వీస్ అధికారులు, ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీల నివాసాల కోసం 2018-19లోనే భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయని సీఎస్ వివరించారు.

**ఏపీ ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో ఏముందంటే..**

ఏపీ ప్రభుత్వం 2014లో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ చట్టాన్ని చేసి ఏపీసీఆర్డీఏని ఏర్పాటు చేసింది. గవర్నర్ ఆమోదముద్రతో ఆ చట్టాన్ని 2014 డిసెంబర్ 30న గెజిట్లో ప్రచురించారు.

విజయవాడ, గుంటూరు నగరాల మధ్య కృష్ణా నదివెంబడి ఉన్న 24 రెవెన్యూ గ్రామాల్లో 53,748 ఎకరాల విస్తీర్ణాన్ని రాజధాని నగర ప్రాంతంగా గుర్తించి 2014 డిసెంబర్ 30న జీఓ ఎంఎస్ నం.254ను విడుదల చేశారు. సీఆర్డీఏ చట్టంలోని సెక్షన్ 3(3)ప్రకారం మొత్తం 122 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని రాజధాని ప్రాంతంగా గర్తించారు. ఆ తర్వాత 2015 జూన్ 9న విడుదల చేసిన జీఓ ఎంఎస్ నెం. 141లో రాజధాని ప్రాంతాన్ని 122 చ.కి.మీ.కి బదులుగా 217 చ.కి.మీలుగా సవరించారు. అమరావతి రాజధాని మాస్టర్ ప్లాన్ చట్టంలోని సెక్షన్ 39 ప్రకారం 2016 ఫిబ్రవరి 23న ప్రచురించింది. మాస్టర్ ప్లాన్?లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కొన్ని హామీలు ఇచ్చింది.

అమరావతిని కేవలం ప్రభుత్వ పరిపాలనా నగరంగానే కాకుండా ఆర్థిక కూడలిగా తీర్చి దిద్దుతామని రైతులకు హామీ ఇచ్చింది. అమరావతిలో కనీసం లక్ష నుంచి 1.5 లక్షల మంది నివసించేలా ఒక్కోటి వెయ్యి ఎకరాల్లో 27 టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తామని ప్రణాళికలో పేర్కొన్నారు. ప్రతి టౌన్ షిప్ 250 ఎకరాల చొప్పున నాలుగు భాగాలుగా విభజించి అక్కడ నివాస ప్రాంతాలకు నడిచి వెళ్లేంత దూరంలో ప్రాథమిక పాఠశాల, షాపింగ్ ఉండేలా చూస్తామని వివరించారు.

కృష్ణానదికి అభిముఖంగా సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు చేసి, అక్కడ అన్ని ముఖ్యమైన కార్పొరేట్, ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్మెంట్స్ ఏర్పాటు చేయడానికి అవకాశం కల్పించాలని నిర్ణయించింది.

2016 ఫిబ్రవరి 23న ప్రకటించిన మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని అభివృద్ధి చేస్తుందని నవ నగరాల ఇతివృత్తంతో దశల వారీగా 2050 వరకు ఈ ప్రక్రియ సాగుతుందని సీఎస్ అఫిడవిట్‌లో వివరించారు. భవిష్యత్తులో ఎదురయ్యే అవసరాలు, అవకాశాలపై ఆధారపడి ఈ ప్రక్రియ కొనసాగుతుందని సుప్రీంకోర్టు ఇచ్చే తదుపరి ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో న్యాయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం కోర్టు ముందున్న ఎస్ఎల్పిపై విచారణ ముగించాలని కోరింది. ఈ పిటిషన్‌పై నేడు చీఫ్ జస్టిస్ విచారణ జరపనున్నారు.

# అందుబాటులోకి లిక్కర్ ధరలు

**ఏలూరు, డిసెంబర్ 13, పెన్ పవర్:** ఏపీలో కొన్ని బ్రాండ్ల మద్యం ధరల్ని తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి పది రోజులు గడుస్తున్నా దుకాణాల్లో మాత్రం అమల్లోకి రాకపోవడంపై హెచ్‌టి తెలుగు కథనానికి ఎక్సైజ్ శాఖ స్పందించింది. తక్షణం కొత్త ధరల్ని అమలు చేయాలని ఆదేశించడంలో ధరలు తగ్గించుకున్న సంస్థలు మార్పులు చేశాయి. ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్‌కు సరఫరా చేసే బాటిళ్లపై కొత్త ధరల్ని అంటించారు. మరో నెలరోజుల వరకు పాత ధరలతోనే కొనసాగాలని భావించినా ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో ధరల్ని సవరించారు. ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల్లో పాత స్టాక్ పూర్తయ్యే వరకు అని మెలిక పెట్టడంతో మరికొన్ని వారాల పాటు పాత ధరలతోనే అమ్ముకోవాలని అయా బ్రాండ్లు భావించాయి.ఆంధ్రప్రదేశ్ మద్యం ధరల తగ్గింపు ప్రకటనలో మతలబును ఎక్సైజ్ సరిచేసింది. మూడు ప్రధాన బ్రాండ్ల మద్యం ధరల్ని తగ్గిస్తూ కొద్ది రోజుల క్రితం ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మద్యం ధరల్ని సవరించిన ప్రతి సందర్భంలో ధరల తగ్గింపు తక్షణం అమల్లోకి వస్తుందని ప్రకటించేది. అయితే ఇటీవల ఎక్సైజ్ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పాత స్టాక్ అమ్మకాలు పూర్తైన తర్వాత తగ్గింపు అమల్లోకి వస్తుందని అయా కంపెనీలకు అనుకూలంగా మెలిక పెట్టింది. దీంతో మద్యం బాదుడు కొనసాగుతోంది. వైసీపీ హయంలో ఉన్న ధరలే ఇంకా కొనసాగుతున్నాయి.తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా డిమాండ్ ఉన్న మద్యం బ్రాండ్లలో కొన్ని బ్రాండ్లు తమ ధరల్ని తగ్గించుకున్నాయి. ఇందులో ప్రముఖ సినీనటుడి పేరుతో చలామణీలో ఉన్న బ్రాండ్ కూడా ఉంది. గత ఐదేళ్లలో ఏపీలో అన్ని రకాల మద్యం బ్రాండ్ల ధరల్లో 100 నుంచి 150శాతం పెరుగుదల నమోదైంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మద్యం అమ్మకాలు, ధరల దోపిడీపై టీడీపీ, జనసేన, బీజేపీలు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించాయి.తాము అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని టీడీపీ, జనసేనలు ఎన్నికల్లో విస్తృతం ప్రచారం చేశాయి. ఈ క్రమంలో సినీ నటుడి బ్రాండ్‌గా ప్రచారంలో ఉన్న ఓ మద్యం కంపెనీ ధరల్ని తగ్గించుకుంటున్నట్టు ఎక్సైజ్ శాఖకు ప్రతిపాదనలు చేయడంలో వెంటనే అమోదించడం జరిగిపోయింది. అయితే ఆ ధరలు తగ్గింపు మాత్రం జనానికి చేరలేదు. రాష్ట్ర వ్యాప్తంగా మరికొన్ని వారాలకు సరిపోయే నిల్వలు ఏపీబీసీఎల్ గోదాముల్లో ఉంది.దుకాణాల్లో ఉన్న స్టాక్ కూడా ధరలు తగ్గించి పది రోజులైనా తరిగిపోవడం లేదు. ప్రస్తుతం విక్రయిస్తున్న బాటిళ్లపై 2024 సెప్టెంబర్‌లో తయారైనట్టు లేబుల్స్ ఉన్నాయి. ఈ లెక్కలో నవంబర్ చివరి వారంలో ఎక్సైజ్ ఉత్తర్వులు జారీ అయ్యే వరకు డిస్టిలరీల్లో మద్యం ఉత్పత్తి జరిగి ఉంటుంది. అవన్నీ పూర్తిగా అమ్మే వరకు జనం పాత ధరలకే మద్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండొచ్చని అంచనాదక్షిణాది రాష్ట్రాల్లో మద్యం విక్రయాలతో ఖజానా నింపుకోవచ్చని వైసీపీ హయంలో రుజువైంది. ఏపీలో మద్యం ధరలు గణనీయంగా పెంచడం ద్వారా రెవిన్యూ పెంచుకోవడంతో ఆ తర్వాత తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో కూడా మద్యం ధరలు పెరిగాయి. అయితే తమిళనాడులో మాత్రమే ఏపీతో పోలిస్తే కొద్దిగా ధరలు అధికంగా ఉన్నా కర్ణాటక, తెలంగాణల్లో ధరలు తక్కువే ఉన్నాయి.ఈ క్రమంలో కొత్తగా రూ.99 బ్రాండ్‌ను తీసుకొచ్చిన మిగిలిన బ్రాండ్ల ధరలను మాత్రమే పాత ధరలనే కొనసాగించింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. జనం జగన్ బాటలోనే చంద్రబాబు ప్రభుత్వం నడుస్తోందని గొణుక్కుంటూ మద్యం కొనుగోలు చేస్తున్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మద్యం ధరలపై ఇప్పటికే రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ నివేదిక రావడానికి ముందే ధరలు తగ్గుముఖం పట్టడం చర్చనీయాంశంగా మారింది. .రాష్ట్రంలో మద్యం ధరలను తగ్గించడానికి మూడు పాపులర్ కంపెనీలు ముందుకు వచ్చాయి. ప్రముఖ సంస్థల ప్రతిపాదనలకు ఎక్సైజ్ శాఖ వాటి ఆమోదం తెలిపింది. తగ్గించిన ధరలను అమల్లోకి తెస్తూ పది రోజుల క్రితం ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ప్రస్తుతం దుకాణాల్లో పాత ఎమ్మార్పీలతో ఉన్న బాటిళ్లను ఆ ధరలకే విక్రయిస్తారు. కొత్తగా వచ్చే స్టాకును తగ్గించిన ధరలతో అమ్ముతారు. ఏపీలో గత ఐదేళ్లలో ప్రముఖ బ్రాండ్ల విక్రయాలకు అవకాశం ఉండేది కాదు. తాజాగా అన్ని బ్రాండ్లను విక్రయించుకోడానికి అనుమతిస్తున్నారు.ధరలు తగ్గిన బ్రాండ్లలో మాన్షన్ హౌస్ ఒకటి. ఏపీలో ప్రముఖ సినీనటుడి అభిమాన బ్రాండుగా గుర్తింపు ఉంది. 2019లో టీడీపీ ప్రభుత్వం గద్దె దిగే సమయానికి మాన్షన్ హౌస్ క్వార్టర్ రూ.110 ఉన్న మద్యాన్ని వైసీపీ హయంలో ఓ దశలో రూ.300కు విక్రయించారు. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ధరలు తగ్గించి చివరకు రూ.220కు ఫిక్స్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అవే ధరలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మాన్షన్ హౌస్ బ్రాందీ క్వార్టర్ ధర రూ.220 నుంచి రూ.190కి తగ్గింది. అదే బ్రాండ్ హాఫ్ బాటిల్ ధర రూ.440 నుంచి రూ.380కి, ఫుల్ బాటిల్ ధర రూ.870 నుంచి రూ.760కి తగ్గించారు. 2019 జూన్ నాటికి మాన్షన్ హౌస్ 760 ఎంఎల్ బాటిల్ రూ.430 ఉండేది. వన్ లీటర్ బాటిల్ రూ.490కు విక్రయించేవారు.రాయల్ చాలెంజ్ సెలెక్ట్ గోల్డ్ విస్కీ క్వార్టర్ ధర రూ.230 నుంచి రూ.210కి తగ్గింది. ఇదే బ్రాండ్ ఫుల్ బాటిల్ ధర రూ.920 నుంచి రూ.840కి తగ్గించారు. యాంటిక్విటీ బ్లూ విస్కీ ఫుల్ బాటిల్ ధర రూ.1600 నుంచి రూ.1400కు తగ్గింది. ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు కాగితాలకే పరిమితం కావడంపైరాష్ట్ర వ్యాప్తంగా కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి.

**కొత్త ధరలపై కొనసాగుతున్న ఉత్కంఠ?**

ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆర్నెల్లు దాటింది. మద్యం ధరల తగ్గింపు మాటటుంచితే ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుతో ప్రభుత్వ ఆదాయం కూడా కోల్పోయిందనే విమర్శలు ఉన్నాయి. మద్యం ధరలపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. త్వరలో ఈ కమిటీ అన్ని బ్రాండ్ల కంపెనీలతో చర్చించి ధరల సవరణపై సిఫారసు చేయనుంది. అందుకు అనుగుణంగా కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. కమిటీ నిర్ణయించక ముందే కొన్ని బ్రాండ్లు రేట్లు తగ్గించుకుంటున్నాయి. మరో రెండు ప్రముఖ బ్రాండ్ల మద్యం ధరలు రెండు మూడు రోజుల్లో ధరలు తగ్గించనున్నాయి.

# కేబినెట్ విస్తరణకు అడగడుగునా అడ్డంకులు

**హైదరాబాద్, డిసెంబర్ 13, పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. అప్పటి నుంచి బుగ్గ కారు కోసం కొందరు నేతలు కంట్లో వత్తులేసుకుని ఎదురు చూస్తున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లడం ఏదో శుభవార్త తెస్తారని ఎదురుచూడడం.. ఢిల్లీ నుంచి వచ్చి విస్తవరణపై పెదవి విప్పకపోవడంతో డీలా పడిపోవడం సర్వ సాధారణమైపోయింది. ఈ నిశబ్ధ వాతావరణంతో కొండంత ఆశ పెట్టుకున్న ఆశావహుల గుండెలు గుభేల్‌మంటున్నాయి. అసలు విస్తరణ ఉంటుందా? ఉంటే ఎప్పుడు ఉంటుంది? అంటూ గుర్రుగా ఉన్నారట ఎమ్మెల్యేలుగతేడాది డిసెంబర్ 7న సీఎంగా అధికార పగ్గాలు చేపట్టిన రేవంత్ రెడ్డి..తనతో పాటు 11మందితో ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి క్యాబినెట్ విస్తరణ ఊరిస్తూనే ఉంది. నెలలు గడుస్తున్నా విస్తరణ మాత్రం జరగడం లేదు. ప్రస్తుతం రేవంత్ క్యాబినెట్‌లో అదనంగా మరో ఆరుగురికి చోటు దక్కే అవకాశం ఉంది. ఈ ఆరు స్థానాల కోసం.. పదుల సార్లు.. అధిష్టానంతో చర్చోప చర్చలు.. మంతనాలు జరిగాయి. ఏడాది పూర్తైనా అదే సాగదీత.. అదే ఊరడింపు..సంక్రాంతికి అన్నారు. అంతలోనే ఉగాది తర్వాత చూద్దామన్నారు. ఇంతలోనే ఆషాఢ మాసం తెరపైకి వచ్చింది. అది పోగానే లోక్‌సభ ఎన్నికలు అడ్డొచ్చాయి. కొత్త పీసీసీ ప్రెసిడెంట్ ఎంపిక తర్వాత.. విస్తరణ పక్కా అంటూ ప్రచారం జరిగింది. చెప్పినట్లుగానే పీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్ నియామకం పూర్తి చేసింది. ఇక అడ్డంకులన్నీ తొలిగిపోయాయి. దసరా పండుగకు కొత్త మంత్రులు వస్తారని అధిష్టానం లీకులు ఇచ్చింది. కానీ ఆ లీకులకు అధిష్టానం పోకడలకు పొంతన లేదు. మొన్నటికి మొన్న దీపావళికి పక్కా అంటూ ఊరడించి ఊసురుమనిపించారు అధిష్టానం పెద్దలు. ఇంతలోనే మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు రాగానే మళ్లీ ఢిల్లీ పెద్దలు సైలెంట్ అయ్యారు. ఆ రెండు రాష్ట్రాల ఫలితాలు వచ్చాయి ప్రభుత్వాలు కొలువుదీరాయి. ఐనా క్యాబినెట్ విస్తరణపై నో క్లారిటీ. మంత్రివర్గంలో చోటు కోసం చాలా మంది ఆశావహులు కొండంత ఆశ పెట్టుకున్నారు. అందులో మాజీ మంత్రులతో పాటు సీనియర్ ఎమ్మెల్యేలు, జూనియర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఎవరి లెవల్ లో వారు పైరవీలు చేసుకుంటూ వస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి అధిష్టానం వరకు విన్నపాలు చేసుకుంటున్నారు. దీంతో క్యాబినెట్ బెర్త్ కోసం పోటీ పడుతున్న వారి సంఖ్య భారీగానే ఉంది. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శ్రీహరి ముదిరాజ్, ఆది శ్రీనివాస్, వివేక్ వెంకట స్వామి, ప్రేమ్ సాగర్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వచ్చే నెల మరో 7 ఎమ్మెల్సీ స్థానాలు కాంగ్రెస్‌కు లభించే అవకాశం ఉంది. ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యే ఒకరిద్దరు నేతలకు కూడా మంత్రివర్గంలో పదవి ఆశిస్తున్నారు. ఈ జాబితాలో షబ్బీర్ అలీ, పహీం ఖురేషీ పేర్లు వినిపిస్తున్నాయి.కేబినెట్ బెర్తులు ఆరు ఖాళీ ఉంటే పోటీ పడుతున్న నేతల సంఖ్య పదికి పైగా ఉంది. దీంతో మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు ఢిల్లీ పెద్దలకు బిగ్ టాస్క్‌గా మారిందట. మంత్రి పదవులు ఆశిస్తున్న ఆశావహులు పెద్ద సంఖ్యలో ఉండటంతో అధిష్టానం ఎటూ తేల్చుకోలేక పోతోందని తెలుస్తోంది. దీనంతటికీ కారణం ఒక్కటే.. అనుకున్న శాఖలు రాకున్నా.. మంత్రి పదవి దక్కకున్నా అసంతృప్తి జ్వాలలు రగిలే అవకాశముంది. అందుకే ఎప్పటికికప్పుడు వాయిదాలు వేస్తూ వస్తోందని ఆ పార్టీ ఇన్‌సైడ్ టాక్..అంతేకాదు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రుల సిఫారసులు కూడా హైకమాండ్‌కు తలనొప్పిగా మారాయంట.. కొందరు కర్ణాటక సర్కార్ పెద్దలతో కూడా సిఫార్సులు చేయిస్తున్నారని సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి రికమండేషన్‌ను పరిగణలోకి తీసుకోవాలో తెలియక హైకమాండ్ పెద్దలు అయోమయంలో పడ్డారనేది కాంగ్రెస్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న చర్చ.. విభేదాలు, అలకలు లేకుండా సాఫీగా సాగిపోతున్న సమయంలో మంత్రివర్గ విస్తరణ చేసి లేని తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకని ఢిల్లీ పెద్దలు వాయిదాల జపం చేస్తున్నారు. మరి ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడని మంత్రి పదవుల ఆశావహులు గుర్రుగా ఉన్నారంట.. మరి హైకమాండ్ ఏం చేస్తుంది, ఈ సారైనా సీఎం హస్తిన టూర్ తీపి కబురుతో ముగుస్తుందో లేదో చూడాలి.

## మౌనికకు మద్దతుగా దిగనున్న అఖిల


**కర్నూలు, డిసెంబర్ 13, పెన్ పవర్:**మంచు కుటుంబంలో ఏర్పడిన వివాదాలు అది వారి కుటుంబ సమస్య నుంచి ఇంకా పెద్దగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే మోహన్ బాబు మనోజ్ భార్య భూమా మౌనికతో పాటు పిల్లలను ఈ విషయంలోకి తీసుకు వచ్చారు. అంతే కాదు మనోజ్, మౌనిక దంపతులకు అన్యాయం జరుగుతోందన్న అభిప్రాయం భూమా వర్గీయుల్లో ఏర్పడటం సహజమే. అందుకే భూమా వర్గం ఈ విషయంలో ఇన్వాల్వ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. మంచు మనోజ్ భార్య భూమా మౌనిక ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్నది. భూమా నాగిరెడ్డి, భూమా శోభా నాగిరెడ్డి అంటే రాష్ట్రంలో పేరున్న నేతలు నాగిరెడ్డి అనారోగ్యంతో శోభానాగిరెడ్డి ప్రమాదంలో చనిపోవడంతో చిన్న వయసులోనే భూమా అఖిలప్రియ రాజకీయాల్లోకి రావాల్సివచ్చింది. తండ్రి ఉన్నప్పుడు తండ్రి చాటున రాజకీయం చేసినా తర్వాత తండ్రి వర్గాన్ని నడిపించడంలో సక్సెస్ అయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ భూవివాదంలో ఆమె కొంత మంది ప్రముఖుల్ని కిడ్నాప్ చేయించారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ కేసులో జైలుకు కూడా వెళ్లారు.అయితే భూమా అఖిలప్రియ ఎప్పుడూ తగ్గలేదు. తన తండ్రిని మరిపించే రాజకీయాలు చేస్తున్నారు. భూమా అఖిలప్రియ సోదరి మౌనిక. అఖిలప్రియ కోసం మౌనిక రాజకీయ ప్రచారం కూడా చేస్తారు. ఇప్పుడు తన సోదరికి మెట్టినింట్లో అన్యాయం జరుగుతోందంటే ఆమె ఖచ్చితంగా రంగంలోకి దిగుతారని అనుకోవచ్చు. ఇప్పటి వరకూ వారి ఫ్యామిలీ ఇష్యూను వారు పరిష్కరించకుంటారని.. తాము జోక్యం చేసుకుంటే ఇంకా ఎక్కువ సమస్యలు వస్తాయని సైలెంట్ ఉన్నారు. కొంత మంది భూమా వర్గీయుల్ని మాత్రం.. మనోజ్ ఇంటి వద్ద సెక్యూరిటీగా ఉండేందుకు పంపారని అంటున్నారు. ఇప్పుడు వివాదం ముదరడంతో ఇక నేరుగా ఫ్యాక్షన్ స్టైల్లో మోహన్ బాబు ఫ్యామిలీతో భూమా వర్గం డీల్ చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మంచు మనోజ్ ఇప్పటికి తాము ఆత్మగౌరవ పోరాటం చేస్తున్నామని అంటున్నారు. తన భార్య, బిడ్డల రక్షణ కోసమే మాట్లాడుతున్నానని .. పోరాటం చేస్తున్నానని చెబుతున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఆయన నుంచి గెంటేశారు. ఈ సమయంలో ఆయన వెనక్కి తగ్గలేరు. తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యే అవకాశం ఉంది.తన భార్య తరపున పొలిటికల్.. ఫ్యాక్షన్ వర్గం పవర్ ను వాడుకుంటే మోహన్ బాబు ఫ్యామిలికీ చాలా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇలాంటి సమస్యలు ఉన్నాయన్న భయం పోలీసులకు ఆయన రాసిన లేఖలో స్పష్టమయిందని అనుకోవచ్చు. మొత్తంగా కుటుంబ గొడవలు ఫ్యాక్షన్ వైపు వెళ్తే మరింత సంచలనం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఆరుదశల్లో ఫించన్ల వడపోత



**నెల్లూరు, డిసెంబర్ 13, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్‌లు అందుకుంటున్న అనర్హులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. పైలట్ ప్రాజెక్టు కింద మూడు జిల్లాల్లో సర్వే చేస్తోంది. పింఛన్ కోసం అడ్డదారుల్లో తప్పుడు సర్టిఫికేట్లు ఇచ్చినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటికి చెక్ పెట్టి నిజమైన అర్హులకే పింఛన్లు అందేలా చర్యలు తీసుకోనున్నారు అధికారులు. ఏపీలో వైకల్యం ఉన్న వారికి 15 వేల రూపాయలు పింఛన్ అందిస్తోంది ప్రభుత్వం. అందుకే ఇందులో ఇప్పటి వరకు ఉన్న అనర్హులను తగ్గించే ప్రయత్నాల్లో ఉంది. గత ప్రభుత్వ హయాంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పింఛన్ పొందుతున్న వాళ్లు చాలా మంది ఉన్నారని అనుమానిస్తోంది. కార్లు, భూములు ఉన్నవాళ్లు, విదేశాల్లో ఫ్యామిలు స్థిరపడినా ఇక్కడ పింఛన్ అందుకుంటున్న వాళ్లు వేలల్లో ఉన్నారు. అలాంటి వారిని ఏరివేయనున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఆరు దశల్లో వివరాలు సేకరిస్తున్నారు. అర్హులు పింఛన్ కోల్పోయి విమర్శలు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకే ఆరు దశల్లో వడపోత చేపడుతోంది. ముందుగా అధికంగా భూమి ఉన్నా, ఫోర్ వీలర్ కలిగి ఉన్నా, ఐటీ కడుతున్నా, ప్రభుత్వ పింఛన్ పొందుతున్నా, అధిక విద్యుత్ వినియోగిస్తున్నా అనర్హులుగా చేస్తారు. తర్వాత దశలో వైకల్య ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. ఈ క్రమంలో ఫిల్టర్ చేసిన జాబితాపై గ్రామంలోనే సభలు నిర్వహించి అర్హులను ప్రకటిస్తారు.ఇలా వివిధ దశల్లో ఫిల్టర్ చేసిన జాబితాను కలెక్టర్‌కు అందజేస్తారు. రాష్ట్రంలోని పలు గ్రామపంచాయితీలను ఎంపిక చేసింది ప్రభుత్వం. అక్కడ పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహించే సర్వేలో వచ్చిన ఫలితాలు ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేస్తారు. లోటు పాట్లు సరి చేసుకొని చర్యలు తీసుకుంటారు. సచివాలయ సిబ్బందిని బృందాలుగా చేసి ఒక్కో టీంకు 40 మంది వివరాలు సేకరించేలా ఆదేశాలు ఇచ్చారు. పింఛన్లు సర్వే కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించారు. అందులోనే వివరాలు నమోదు చేస్తున్నారు. ఎంపీడీవోలు ఈ సర్వే బృందాలకు పర్యవేక్షణ అధికారులుగా ఉంటారు. ఇందులో అనర్హులను గుర్తించి జనవరి నుంచి వారి పింఛన్ నిలిపేస్తారు. ఎందుకు పింఛన్ ఆపేస్తున్నారో వాళ్లకు లేఖ రూపంలో తెలియజేస్తారు. వాటిని పరిశీలించి వాటికి తగ్గట్టుగా ధ్రువపత్రాలు సమర్పిస్తే మళ్లీ పరిశీలించి పింఛన్ పునరుద్ధరిస్తారు. తిరుపతిలోని జీవకోనను ఎంపిక చేశారు. తిరుపతి జిల్లాలో 31 వేల 153 మంది దివ్యాంగ పింఛన్ అందుకుంటున్నారు. చిత్తూరు జిల్లా ముత్తుకూరు గ్రామపంచాయతీలో కూడా సర్వే చేస్తున్నారు. వైఎస్ఆర్ జిల్లా చాపాడు మండలం లక్ష్మీపేట, అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం ఈటూమార్పురం సచివాలయం పరిధిలో పింఛన్‌లపై సర్వే చేస్తున్నారు

## అదుపుతప్పి కారు బోల్తా... ఒకరికి స్వల్ప గాయాలు



**జడ్చర్ల పెన్ పవర్:** అదుపుతప్పి కారు బోల్తా పడి ఒకరికి గాయాలైన ఘటన జడ్చర్ల నియోజకవర్గం గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. బాలానగర్ మండలం పెద్దరేవల్లి గ్రామ శివారులో గౌతం పల్లికి చెందిన హతిరాం నాయక్ షాద్ నగర్ నుంచి గౌతంపల్లి వెళ్తుండగా పెద్దరేవల్లి గ్రామ శివారు మోదంపల్లి గేటు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలు అయ్యాయి.

## తమిళనాడు లో భారీ వర్షాలు

**చెన్నై: పెన్ పవర్:**తమిళనాడుపై అల్పపీడనం ఎఫెక్ట్ తీవ్రంగా కనిపిస్తోంది. తమిళనాడులో మరోసారి కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దాంతో.. జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమిళనాడులోని 17 జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అటు.. వాతావరణం అనుకూలించకపోవడంతో చెన్నై ఎయిర్పోర్ట్ నుంచి విమానాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

# ఇంతకీ గుకేశ్ తెలుగువాడా? తమిళియనా?.. క్రెడిట్ కోసం చంద్రబాబు, స్టాలిన్ మధ్య పోరు!

**అతడు ఏ రాష్ట్రం వాడన్నదానిపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ**

**రెండు నిమిషాల తేడాతో స్టాలిన్, చంద్రబాబు పోస్టులు**

**నెటిజన్లలో ఎక్కువమంది తమిళియన్ అన్న వాదనను సమర్థిస్తున్న వైనం**

**అతడి మూలాలను వెతకడంపై మరో యూజర్ ఆశ్చర్యం**

**అతడు భారతీయుడంటూ చర్చకు ఫుల్‌స్టాప్ పెట్టే యత్నం**



**హైదరాబాద్ పెన్ పవర్:** గుకేశ్ దొమ్మరాజు.. ఇప్పుడీ పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోతోంది. వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ విజేతగా నిలిచిన గుకేశ్.. 18 ఏళ్ల అతి పిన్న వయసులోనే ఆ ఘనత సాధించిన రికార్డును తన పేరున రాసుకున్నాడు. క్రీడా, రాజకీయ రంగాల ప్రముఖుల నుంచి గుకేశ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. అదే సమయంలో అతడు తెలుగువాడా? తమిళియనా? అన్న చర్చ మొదలైంది. దీనికి కారణం కూడా లేకపోలేదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎవరికి వారే అతడు తమ వాడని చెప్పుకోవడమే అందుకు కారణం. గుకేశ్ టైటిల్ సాధించగానే ఎక్స్ వేదికగా స్టాలిన్ స్పందిస్తూ.. గుకేశ్ అద్భుత విజయాన్ని ప్రశంసించారు. మరో చాంపియన్‌ను తయారు చేయడం ద్వారా ప్రపంచ చెస్ క్యాపిటల్‌గా చెన్నై తన స్థానాన్ని నిలబెట్టుకుందని పేర్కొన్నారు. గుకేశ్‌ను చూసి తమిళనాడు గర్విస్తోందంటూ అతడి మెడలో బగారు పతకం వేస్తున్న పాత ఫొటోను పంచుకున్నారు.

స్టాలిన్ సాయంత్రం 7.25 గంటల సమయంలో ఎక్స్‌లో స్పందించగా ఆ తర్వాత రెండు నిమిషాలకే చంద్రబాబు కూడా స్పందించారు. 'మా సొంత తెలుగు బిడ్డకు హృదయపూర్వక అభినందనలు" అని రాసుకొచ్చారు. 18 ఏళ్ల వయసులోనే ఇండియన్ గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించిన గుకేశ్‌కు అభినందనలు అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ అద్వితీయ విజయాన్ని దేశం మొత్తం సెలబ్రేట్ చేసుకుంటోందని తెలిపారు.

### ఇంతకీ గుకేశ్ ఎవరు?

గుకేశ్‌లో తెలుగు మూలాలు ఉన్నప్పటికీ అతడు పుట్టింది, పెరిగిందీ చెన్నైలోనే. తల్లిదండ్రులిద్దరూ మెడికల్ ప్రొఫెషనల్సే. చంద్రబాబు, స్టాలిన్ పోస్టుల తర్వాత గుకేశ్ తెలుగువాడా? తమిళనాడుకు చెందినవాడా? అన్న చర్చ సోషల్ మీడియాలోనూ జోరుగా సాగుతోంది. గుకేశ్‌కు తమిళనాడు ప్రభుత్వం ఆర్థికంగా సాయం అందించిన విషయాన్ని చాలామంది గుర్తుచేశారు. ఈ చెస్ స్టార్‌కు స్టాలిన్ ప్రభుత్వం ఏప్రిల్‌లో రూ. 75 లక్షలు సాయం చేసినప్పటి స్క్రీన్ షాట్లను పంచుకుంటున్నారు.

తెలుగు గ్రాండ్ మాస్టర్ అయిన గుకేశ్ దొమ్మరాజు కెరియర్‌కు తమిళనాడు ప్రభుత్వం అండగా నిలిచిందని, ఇప్పుడతడు తమవాడేనని తెలుగు రాష్ట్రాలు చెప్పుకోవడం ప్రారంభించాలని ఓ యూజర్ ఎద్దేవా చేశాడు. గుకేశ్ విషయంలో తమిళనాడు వాదనను ఎక్కువమంది యూజర్లు సమర్థిస్తున్నారు. తమిళనాడు చెస్ సంస్కృతి, మౌలిక సదుపాయాలు అతడి విజయానికి కీలకంగా నిలిచాయని మరో యూజర్ పేర్కొన్నాడు. ఇప్పుడు మరో రాష్ట్రం ఆ క్రెడిట్‌ను కొట్టేయాలని చూస్తోందని విమర్శించాడు. నిజానికి అతడు ఏ రాష్ట్రం వాడన్నది ముఖ్యం కాదని, అతడు భారతీయుడని మరో యూజర్ పేర్కొన్నాడు. దేశంలోని ఏదో ఒక రాష్ట్రంలో అతడి పూర్వీకులు, కులాన్ని కనుగొనడం హాస్యాస్పదంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు.

# కొత్త బాల్‌తో రోహిత్ ప్రాక్టీస్.. మూడో టెస్ట్‌లో ఓపెనర్‌గా వచ్చే చాన్స్

**టీమ్‌ను ఉద్దేశించి మాట్లాడిన కోహ్లీ**

**హర్షిత్ రాణా ప్లేస్‌లో ఆకాశ్‌దీప్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో మూడో టెస్ట్‌కు టైమ్ దగ్గరపడుతున్న వేళ.. విరాట్ కోహ్లీ కొత్త బాధ్యత తీసుకున్నాడు. రెండో టెస్ట్‌లో 10 వికెట్ల తేడాతో ఓడిన టీమిండియాలో స్ఫూర్తిని నింపే పనిలో పడ్డాడు. కెప్టెన్సీ కోల్పోయిన తర్వాత వెనక సీటుకే పరిమితమైన కింగ్ కోహ్లీ గురువారం మాత్రం సహచరులతో అన్ని విషయాలపై స్వేచ్ఛగా మాట్లాడాడు. తన స్ఫూర్తిదాయకమైన మాటలతో ప్లేయర్లలో కాన్ఫిడెన్స్‌ను పెంచే ప్రయత్నం చేశాడు.

కెప్టెన్ రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ బుమ్రాతో సహా మిగతా ప్లేయర్లందరూ విరాట్ మాటలను శ్రద్ధగా విన్నారు. రెండో టెస్ట్‌లో ఫెయిలైన రోహిత్ మరోసారి ఓపెనర్‌గా వచ్చే చాన్స్ కనిపిస్తోంది. రాహులతో కలిసి నెట్స్‌లోకి వచ్చిన హిట్‌మ్యాన్ కొత్త, పాత బడిన బాల్స్‌తో ప్రాక్టీస్ చేశాడు. యశస్వి కూడా కొత్త బాల్‌ను ఎదుర్కొన్నాడు. పిచ్‌పై గడ్డి ఎక్కువగా ఉండటంతో సీమ్, బౌన్స్ ఉంటాయిని అంచనా వేస్తున్నారు.

### హర్షిత్ డౌటే..

ఈ మ్యాచ్ కోసం ఫైనల్ ఎలెవన్‌లోనూ మార్పులు చేయాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. హర్షిత్ రాణా ప్లేస్‌లో ఆకాశ్‌దీప్‌ను బరిలోకి దించాలని యోచిస్తోంది. ఈ మేరకు ఆకాశ్ నెట్స్‌లో చాలా స్థిరంగా బౌలింగ్ చేశాడు. అయితే గబ్బా పిచ్ హర్షిత్ బౌలింగ్ శైలికి బాగా సరిపోతుంది. కాకపోతే పెర్త్ టెస్ట్‌లో నాలుగు వికెట్లు తీసిన అతను పింక్ మ్యాచ్‌లో మాత్రం ఘోరంగా తేలిపోయాడు. అయితే ఆకాశ్‌దీప్‌కు ఫస్ట్ క్లాస్ ఎక్స్‌పీరియెన్స్ ఎక్కువగా ఉండటం కూడా కలిసొచ్చే అంశం. కాకపోతే గంభీర్.. హర్షిత్ టాలెంట్‌పై ఎక్కువగా నమ్మకం పెట్టుకున్నాడు. మూడో టెస్ట్ తొలి రోజు వర్షం పడే చాన్స్ ఉండటంతో బలమైన సీమ్ బౌలింగ్‌ను ఎంచుకోవాలని గౌతీ ఆలోచిస్తున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో రాణించిన పేసర్ మహ్మద్ షమీ ఆసీస్ టూర్‌కు రావడం కష్టమే. టెస్ట్‌లు ఆడే ఫిట్‌నెస్‌ను అతను ఇంకా సాధించలేదని తెలుస్తోంది.

### ఏకైక స్పిన్నర్ ఎవరు?

బ్యాటింగ్ టెక్నిక్‌లో సుందర్ మెరుగ్గా కనిపిస్తున్నా.. స్పిన్ పరంగా చూస్తే అశ్విన్ టాప్ ప్లేస్‌లో ఉంటాడు. ఇక ఆల్‌రౌండర్ ప్యాకేజ్‌లో రవీంద్ర జడేజాను మించినోళ్లు లేరు. దీంతో మూడో టెస్ట్‌లో ఆడే ఏకైక స్పిన్నర్ ఎవరు? అనే దానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఆసీస్ మిడిలార్డర్‌ను నిలువరించే టాప్ స్పిన్నర్‌ను బరిలోకి దించాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అడిలైడ్‌లో అశ్విన్ బాగా బౌలింగ్ చేశాడు. జడేజాకు ఇంకా చాన్స్ రాలేదు.

# బీచ్‌లో 45 ఏళ్ల బ్యూటీ స్టన్స్



# సమంత టాలీవుడ్ కి ఇప్పట్లో కష్టమే!



**హైదరాబాద్ పెన్ పవర్:** సమంత టాలీవుడ్ లో సినిమాలు చేయాలని దర్శకుడు త్రివిక్రమ్ రిక్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కొంత కాలంగా సమంత ముంబైలోనే ఎక్కువగా ఉండిపోవడంతో ముంబైనే కాదు అప్పుడప్పుడు హైదరాబాద్ కూడా వచ్చి తెలుగు సినిమాలు చేయాలని పబ్లిక్ గానే త్రివిక్రమ్ కోరాడు. అంత వరకూ ఏ దర్శకుడు ఆమెని తెలుగు సినిమాలు చేయమని అడగలేదు. తొలిసారి గురూజీని అడిగే సరికి సర్ ప్రైజ్ గా అనిపించింది. అయితే అప్పటికే సమంతతో గురూజీ కొన్ని సినిమాలు చేసారు.ఆమెను ఎంతో గొప్ప నటిగానూ త్రివిక్రమ్ గుర్తిస్తారు. మరి గురూజీ మాట ప్రకారం సమంత మళ్లీ తెలుగు సినిమాలు చేస్తుందా అంటే అది ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించలేదు. సమంత నటించిన %-%శాకుతలం%-, -%ఖుషీ%-% గత ఏడాది రిలీజ్ అయ్యాయి. రెండు పెద్దగా ఫలితాలు సాధించలేదు. ఆ తర్వాత అమ్మడు అమెరికా వెళ్లిపోయింది. ఏడాది పాటు అమెరికాలోనే ఉంది. ఆ తర్వాత నేరుగా అమెరికా నుంచి ముంబైకి వచ్చింది. అప్పటి నుంచి ముంబైలోనే ఉంటుంది.అప్పటికే కొన్ని హిందీ వెబ్ సిరీస్ లు...సినిమాలకు సైన్ చేసింది. ప్రస్తుతం వాటి పనుల్లోనే బిజీగా ఉంది. అప్పటి నుంచి అమ్మడు మళ్లీ హైదరాబాద్ వచ్చింది లేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం అప్పుడప్పుడు వైవిధ్య మైన పోస్టులు పెడుతూ కాస్త వివాదాస్పదంగానూ మారుతుంది. ఆ కారణంగా కొంత నెగిటివిటీని ఎదుర్కుంటుంది. ఆమె పెట్టే పోస్టులు టాలీవుడ్ లో ఓ ఇద్దర్ని ప్రత్యేకంగా టార్గెట్ చేస్తున్నాయనే ఆరోపణ వినిపిస్తుంది. మరి ఇలాంటి సమయంలో సమంత మళ్లి తెలుగు సినిమాల వైపు చూస్తుందా అంటే నో ఛాన్స్ అనే మాట వినిపిస్తుంది. తెలుగులో ఆమె ఎరా కొంత కాలంగా సాగింది. ఆమె ఇప్పుడు తెలుగు కంటే హిందీ లోనే సంచలనం అవ్వాలనే ప్లానింగ్ తో ఉందని...తెలుగులో ఎంత పెద్ద ఆఫర్ వచ్చినా చేసే అవకాశాలు లేవనే మాట వినిపిస్తుంది.

# మంత్రముగ్ధులను చేసే మృణాల్ ఠాకూర్ చిత్రాలు మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తాయి



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com